ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు 3
జిల్లా వార్తలు
గురువారం 23 జనవరి 2025

ఉపాధ్యాయుడి వెకిలి చేష్టలు

- బాలికల పట్ల అసభ్య ప్రవర్తన
- తల్లిదండ్రుల ఆందోళన.. సస్పెండ్ చేసిన డీఈవో

5లో...




గుంజల్లి సుజయీంద్ర (ఫైల్)


హయవదన (ఫైల్)


అభిలాష (ఫైల్)


డ్రైవర్ కంసాలి శివ (ఫైల్)


గాయపడిన సంస్కృత విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న లింగసూగూరు డీఎస్పీ దత్తాత్రేయ కర్నాడు

కన్నీటి వేదన

- కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం
- ముగ్గురు సంస్కృత పాఠశాల విద్యార్థులతోపాటు డ్రైవర్ మృతి
- సీఎం, డిప్యూటీ సీఎంల దిగ్భ్రాంతి
- బాధిత కుటుంబాలకు కర్ణాటక సీఎం ఆర్థిక సాయం
- కన్నీరు పెట్టుకున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

వేద పాఠాలు నేర్చుకోవాల్సిన విద్యార్థుల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. తమ బిడ్డలు గొప్ప పండితులుగా తయారై బయటకు వస్తారనుకున్న తల్లిదండ్రుల ఆశలు ఆవిరయ్యాయి. నరహరితీర్థుల ఉత్తరారాధన పూజల కోసం మంత్రాలయం నుంచి కర్ణాటకకు బయలుదేరిన ముగ్గురు వేద విద్యార్థులను తుఫాన్ వాహనం రూపంలో మృత్యువు వెంటాడింది. వాహనం ఎక్సెల్ విరిగిపోవడంతో మూడు పల్టీలు కొట్టింది. ముగ్గురు వేద విద్యార్థులు మృతి చెందడంతో ఆయా కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది.

సంస్కృత పాఠశాలలో విషాదం నెలకొంది. అయ్యో.. బిడ్డా.. అప్పుడే నూరేళ్లు నిండాయా అంటూ తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు అందరినీ కంట తడిపెట్టించింది. ఇదే ఘటనలో డ్రైవర్ కూడా మృత్యు వాతపడడంతో ఆ కుటుంబంలోనూ విషాదం నెలకొంది. నలుగురి కొడుకుల్లో ఇప్పటికే ఒకరు మృతి చెందాడని, ఇప్పుడు ఇంకో కొడుకు మృతి చెందాడని, తాము ఎవరి కోసం బతకాలని డ్రైవర్ తండ్రి కన్నీరుమున్నీరయ్యాడు.

మిగతా 5 పేజీలో...


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

జేఈఈ-మెయిన్ ప్రవేశ పరీక్ష ఆరంభం


పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థినులు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జాతీయ విద్యాసంస్థల్లో బీటెక్, బీఆర్క్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ-మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్ష బుధవారం ప్రారంభమైంది. ఈ పరీక్ష ఈ నెల 30వ తేదీ వరకు రెండు సెషన్స్‌లో కొనసాగుతాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష జరిగింది. కర్నూలు నంద్యాల రోడ్డులోని సనత్‌నగర్‌లో ఉన్న అయాన్ డిజిటల్ సెంటర్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షా సమయం కంటే రెండు గంటల ముందే కేంద్రానికి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, బంధువులు చేరుకున్నారు. నిర్వాహకులు మెయిన్ గేటు వద్ద విద్యార్థులు చెక్ చేసి పరీక్ష కేంద్రం లోనికి అనుమతించారు. విద్యార్థుల సౌకర్యార్థం సెల్‌ఫోన్లను, బ్యాగ్‌లను డిపాజిట్ చేసుకునేందుకు లాకర్లను ఏర్పాటు చేశారు.

సమన్వయంతో పని చేయండి

- మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఏ లోటూ రాకూడదు
- సంతృప్తికరమైన దర్శనాన్ని కల్పించాలి
- పాదయాత్రికులకు ప్రత్యేక సేవలు
- అటవీ చెక్‌పోస్టుల్లో రుసుముకు మినహాయింపు
- ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు
- నంద్యాల కలెక్టర్ రాజకుమారి


మాట్లాడుతున్న నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారీ

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఏలోటు రానివ్వకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం శ్రీశైలంలోని అన్నదాన వితరణ ప్రాంగణంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవస్థానం ఈవో శ్రీనివాసరావుతో కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. శాఖల వారీగా సమీక్షించి అవసరమైన ప్రతిపాదనలను దేవస్థానం ఈవోకు నివేదిస్తే ఏర్పాట్లపై దృష్టి సారిస్తామన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున దేవస్థానం, పోలీసు శాఖతో మిగతా శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో వ్యవహరించి భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందుకోసం ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని ఆదేశించారు. ప్రత్యేకించి భక్తులకు సంతృప్తికరమైన దర్శనం కలిగేలా చూడాలని, శీఘ్ర దర్శనానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు మంచినీరు, పాలు, అల్పాహారం సమకూర్చాలని తెలిపారు. అదేవిధంగా పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి దాదాపు 800 బస్సులు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పటిష్ఠమైన ప్రణాళికలతో పార్కింగ్ సదుపాయం కల్పించాలని చెప్పారు. రహదారి మార్గంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. హెల్ప్ డెస్క్, కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు భక్తులకు సమాచారం అందించాలని అన్నారు. శానిటేషన్ సమస్య ఉత్పన్నం కాకుండా మూడు షిఫ్ట్‌ల్లో మురికికాల్వలను శుభ్రం చేయించాలని అన్నారు.

మిగతా 4వ పేజీలో...

మంత్రాలయం హుండీ ఆదాయం

రూ.4.80 కోట్లు


హుండీని లెక్కిస్తున్న దృశ్యం

మంత్రాలయం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం మంత్రాలయం చరిత్రలోనే రికార్డుస్థాయిలో నమోదైంది. బుధవారం జరిగిన లెక్కింపులో రూ.4,80,33,154 నగదు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, మేనేజర్ సీ, ఈఈ సురేష్ కోణాపూర్ తెలిపారు. 2024 డిసెంబరు నెల ఎనిమిది రోజులతోపాటు 2025 జనవరి 22 వరకు సంబంధించిన 30 రోజుల హుండీని బుధవారం మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య హుండీలను లెక్కించినట్లు తెలిపారు. రూ.4,80,33,154 నగదుతోపాటు 1780 గ్రాముల వెండి, 42.270 గ్రాముల బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో జేపీ స్వామి, కృష్ణమూర్తి, సుజ్ఞానేంద్ర పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గర్భిణుల వివరాలను వంద శాతం నమోదు చేసి వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా వైద్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ 38,018 మంది గర్భిణులను గుర్తించి, అందులో 34198 మందిని మాత్రమే రిజిస్టర్ చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళలు గర్భం దాల్చిన 3 నెలలోపే ఎందుకు నమోదు చేయలేకపోతున్నారని డీఎంహెచ్‌వోను ప్రశ్నించారు. ఈ పని సవ్యంగా చేయని సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. అబా ఐడీలు జనరేషన్ 68 శాతం మాత్రమే చేశారని, ఇంకా ఏడు వేల మందికి కార్డులు వెంటనే జనరేట్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా.శాంతికళ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెడెంట్ డా.వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ కృష్ణ ప్రకాష్ పాల్గొన్నారు.

పత్తి జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్ వల్ల చెలరేగిన మంటలు
- పరుగులు తీసిన హమాలీలు, రైతులు
- రూ.10 కోట్లకు పైగా పత్తి, దూది, ఆస్తి నష్టం
- రాత్రి వరకు అదుపులోకి రాని మంటలు
- ఆర్ఎఫ్ఓ, డీఎఫ్ఓల పర్యవేక్షణలో సహాయక చర్యలు




జిన్నింగు మిల్లులో కాలిపోతున్న పత్తి

ఆదోని అగ్రికల్చర్/కర్నూలు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంతోష్ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ టీఎంసీ పరిశ్రమలో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో హమాలీలు, కూలీలు భోజనాలు చేస్తున్నారు. మిల్లు మధ్యలో విద్యుత్ తీగలకు ఎక్స్‌కలేటర్ తగిలి షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది ఆర్పే ప్రయత్నాలు చేశారు. వందల టన్నులు పత్తి, దూది బేళ్లు ఉండడంతో క్షణాల్లో మంటలు మిల్లు మొత్తం వ్యాపించాయి. హమాలీలు, కూలీలు, రైతులు ప్రాణభయంతో పరుగులు తీశారు. దాదాపుగా రూ.10 కోట్ల నష్టం జరిగింది. ఆదోని పత్తి మార్కెట్ యార్డు సమీపంలోని సంతోష్ టీఎంసీ పత్తి జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమలో బుధవారం హమాలీలు, కూలీలు బిజీగా ఉన్నారు. వివిధ గ్రామాల నుంచి పత్తి తీసుకొచ్చిన రైతులు కూడా ఉన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మిల్లు మధ్యలో ఉన్న ఎక్స్‌కలేటర్.. పైన ఉన్న విద్యుత్ తీగలకు తగిలి, షార్ట్ సర్క్యూట్ ఏర్పడి నిప్పు రవ్వలు పత్తి, దూదిపై పడ్డాయి. పత్తి, దూది, దూదిబేళ్ల పెద్ద సంఖ్యలో నిలువ ఉండడంతో నిప్పు రవ్వలు పడగానే మంటలు చెలరేగాయి. మిల్లులో ఉన్న అగ్నిమాపక పరికరాలతో మంటలు ఆర్పేందుకు హమాలీలు, సిబ్బంది ప్రయత్నించారు. అయినా క్షణాల్లో మంటలు మిల్లు మొత్తాన్ని వ్యాపించి ఉవ్వెత్తున ఎగశాయి. హమాలీలు, కూలీలు, సిబ్బంది, రైతులు ప్రాణభయంతో పరుగులు బయటకు పరుగులు తీశారు. మిల్లు అంతా దట్టమైన పొగ అలుముకుంది.

(మిగతా 5వ పేజీలో...)

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు అడ్డుకట్ట

- లైంగిక నేరాలు అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు
- త్వరలోనే సీఐలకు పదోన్నతులు
- డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

కర్నూలు క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని నేరాలను అడ్డుకట్ట వేసేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని డీజీపీ సీహెచ్ ద్వారక తిరుమలరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియం వద్ద పోలీసుల నుంచి డీజీపీ గౌరవ వందనం స్వీకరించారు. ఆడిటోరియం ఎదుట మొక్కలు నాటారు. అనంతరం డీజీపీని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ జి.బిందుమాధవ్ శాలువాతో సన్మానించి, నటరాజ విగ్రహ జ్ఞాపికను అందజేశారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఇన్‌విజిబుల్ పోలీస్‌తో విజిబుల్ పోలీసింగ్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసులను ఎక్కువ శాతం రోడ్ల మీదకు పంపకుండా టెక్నాలజీ ఉపయోగించుకునేలా చేస్తున్నామని తెలిపారు. బార్డర్‌లో ఎలాగైతే కనిపించని సైనికులు పని చేస్తుంటారో.. అలాగే ఇన్‌విజిబుల్‌తో పోలీసింగ్ చేయాలని సూచించారు. నేరాల తీవ్రత తగ్గించాలని, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలను అరికట్టాలని పోలీసులను ఆదేశించారు. విరివిగా సీసీ కెమెరాలు, బాడీవోర్న్ కెమెరాలు, వజ్ర, ఫాల్కన్ వాహనాలతో నేరాలు అరికట్టాలన్నారు. సైబర్ నేరాలను కట్టడి చేయాలని, ప్రతి బాధితుని నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలని పేర్కొన్నారు. మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాల పట్ల ఉక్కుపాదం మోపేందుకు వెనుకాడవద్దని ఆయన ఆదేశించారు. ఇందు కోసం ప్రత్యేకంగా పోలీసు బృందాలు ఏర్పాటు చేసి నేరాలను ఛేదించాలని సూచించారు. పోక్సో యాక్టు కేసును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సీఐలకు డీఎస్పీలుగా త్వరలో పదోన్నతులు కల్పిస్తామని పేర్కొన్నారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏఎస్పీ ట్రైనీగా జిల్లాలో పని చేశాన్నారు. ఏఎస్పీ ట్రైనీగా పని చేసిన విషయాలను, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో కొత్త కొత్త నేరాలు వెలుగులోకి వస్తున్నాయని, వాటిని అరికట్టడంపై జిల్లా పోలీసులతో సమీక్షించామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే పోలీసు యంత్రాంగం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్, హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ ఎం.మహేష్ కుమార్, అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుసేన్ పీరా, డీఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, హేమలత, భాస్కర్ రావు, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐలు, ఆర్ఐలు ఉన్నారు.



మాట్లాడుతున్న డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

రైతు ఆత్మహత్య 5

రూ.291.67 కోట్లతో నగర పాలక సంస్థ బడ్జెట్ 4

అరటి సాగులో రికార్డు
ఆదర్శంగా నిలిచిన చాగలమర్రి రైతు



డీజీపీ ద్వారకా తిరుమలరావుతో నంద్యాల జిల్లా పోలీసు యంత్రాంగం



కర్నూలులో మాట్లాడుతున్న డీజీపీ

త్వరలో పదోన్నతులు

- నేరాల నియంత్రణలో పోలీసుల పని తీరు భేష్
- డీజీపీ ద్వారకా తిరుమలరావు

నంద్యాల క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో త్వరలో పదోన్నతుల ప్రక్రియ చేపట్టనున్నామని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. ప్రస్తుతం అర్హత గల సీఐలకు డీఎస్పీలుగా, డీఎస్పీలకు అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో పోలీసుల పనితీరు భేషుగ్గా ఉందన్నారు. నంద్యాల జిల్లా పోలీస్ అధికారులతో రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా డీజీపీ నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకోగానే కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. డీజీపీ సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీస్ యంత్రాంగంతో డీజీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా నంద్యాల జిల్లా ఎస్పీ నంద్యాల జిల్లాలో నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యలను డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ వివిధ రకాల నేరాల నియంత్రణలో పోలీసు అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. నేరాల నియంత్రణలో పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమని ప్రశంసించారు. రాష్ట్ర వ్యాప్తంగా నేరాల సంఖ్య తగ్గిందన్నారు. ప్రస్తుతం నేరాలు అదుపులో ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీస్ అధికారులు, సిబ్బంది సైబర్ నేరాలు, ముఖ్యమైన కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని, నేరాల నియంత్రణకు ఎప్పటికప్పుడు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబద్ధతతో పనిచేసి జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించాలని ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అసాంఘిక శక్తులను అడ్డుకునేందుకు టెక్నాలజీని వినియోగించాలనే ఉద్దేశంతోనే డ్రోన్స్, సీసీ కెమెరాలు వాడుతున్నామన్నారు. నేరాలు జరిగే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరస్తులను కనుగొనేందుకు సులభతరమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో ఫింగర్‌ప్రింట్ యూనిట్ బలోపేతం చేయడం ద్వారా వివిధ రకాల కేసుల్లో నేరస్తులను కనుగొని కేసులను ఛేదిస్తున్నామన్నారు. క్రైమ్ డిటెక్షన్‌లో సీసీ ఫుటేజ్ ఆధారాలు చాలా కీలకపాత్ర పోషిస్తాయని, వీటి కోసం రాష్ట్రంలో 18 వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరో లక్ష కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ వివరించారు. కార్యక్రమంలో డీఐజీ, ఎస్పీలతోపాటు అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, నంద్యాల ఎస్‌డీపీవో మంద జావళి ఆల్ఫోన్స్, డీఎస్పీలు రవికుమార్, శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంచండి

- సంక్రాంతికి రూ.23.70 కోట్ల రాబడి
- ఈనెల చివరిలోగా ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం
- ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు వెల్లడి

కర్నూలు రూరల్, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో వ్యయాన్ని తగ్గించి.. ఆదాయాన్ని పెంచాలని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఆ శాఖ ఉద్యోగులకు సూచించారు. తాను ఆర్టీసీ ఎండీగా చార్జ్ తీసుకొని దాదాపు 44 నెలలు కావస్తోందని, ఈక్రమంలో కార్పొరేషన్‌లో అనేక సంస్కరణలు తీసుకొచ్చానని వివరించారు. బుధవారం కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ఆర్టీసీ కర్నూలు-1డిపో గ్యారేజీలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సంక్రాంతి పండుగకు రూ.23.70 కోట్ల దాకా కార్పొరేషన్‌కు ఆదాయం తీసుకవచ్చి ఆర్టీసీ చరిత్ర సృష్టించిందని అన్నారు. ప్రమాద బీమా సీపీఎస్‌కు అంతకముందు రూ.30 లక్షలు మాత్రమే ఉండేదని, తాను వచ్చిన తర్వాత కోటి రూపాయల వరకు పెంచానని అన్నారు. ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించామన్నారు. పాత అప్పులన్నీ కార్పొరేషన్ చెల్లిస్తుందన్నారు. ఆర్టీసీలో కారుణ్య నియమాకాలను చేపట్టి చనిపోయిన ఉద్యోగ కుటుంబాలను పరోక్షంగా ఆదుకున్నామన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో మిగిలిన అరియర్స్ 25శాతం చెల్లిస్తామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలను ఈ నెల చివరిలోపు పరిష్కరిస్తానని వెల్లడించారు. ఆర్టీసీ మనుగడ, అస్తిత్వం ప్రయాణికులపై ఆధారపడి వుందని, వారికి మంచి సేవలను అందించి సంస్థను మరింత అభివృద్ధిలోకి తీసుకరాలని అన్నారు. అంతకముందు కర్నూలు-1డిపో గ్యారేజీలో ఎండీ ద్వారకా తిరుమలరావు మొక్కలు నాటారు. ఆయన వెంట కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ బిందుమాధవ్ ఉన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఈడీ ఫైడీ చంద్రశేఖర్, ప్రజారవాణా అధికారి శ్రీనివాసులు, సీఎంఈ హరిబాబు, డిపో మేనేజర్లు సర్దార్ హుస్సేన్, సంధ్యారాణి, ఎన్‌యంయూ, ఈయూ నాయకులు ఆర్టీసీ సిబ్బంది, పాల్గొన్నారు.

రంగోత్సవం పోటీలు

- విజేతలకు బహుమతి ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ డా.ఎన్.అయూబ్ హుశేన్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాండ్రపాడు జిల్లా విద్యా శిక్షణ సంస్థలో బుధవారం జిల్లా స్థాయి రంగోత్సవం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులు 45 మంది వివిధ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ డా.ఎన్. అయూబ్ హుశేన్ బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఏపీ, పంజాబ్ రాష్ట్రాల నుంచి క్విజ్ పోటీల్లో మొదటి బహుమతి ఎం శిఫామహేవిష్, ద్వితీయ బహుమతి ఎస్. పూజ, తృతీయ బహుమతి మహ్మద్ షఫీ, డ్రాయింగ్, కాంపిటీషన్‌లో భారత స్వాతంత్ర సమరయోధుల చిత్రాల్లో ప్రథమ బహుమతి కే విశాల్, ద్వితీయ బహుమతి కే చర దీపిక, తృతీయ బహుమతి అరీఫ్ అహ్మద్, చేతిరాత (తెలుగు, ఇంగ్లీషు) పోటీల్లో ప్రథమ బహుమతి ఎ. హర్షిత (తెలుగు), ద్వితీయ బహుమతి ధర్మతేజ, తృతీయ బహుమతి ఏ. జానకి, ఇంగ్లీషు మీడియంలో ప్రథమ బహుమతి కే శిరీష, ద్వితీయ బహుమతి జయశ్రీ సాయిమీనాక్షి, తృతీయ బహుమతి లెనిన్ కుమార్, రంగోలి పోటీల్లో ప్రథమం జి.అక్షరశ్రీ, రెండో బహుమతి కే.పావని గెలుచుకున్నారు. ఆంధ్రప్రదేశ్, పంజాబ్ ఫోక్ డ్యాన్స్ కాంపిటీషన్‌లో మొదటి బహుమతి సమీర, రెండో బహుమతి ఎ. సాయి, డిజిటల్ కోలార్జ్ (యూనిట్, ఇంటిగ్రేటెడ్ పోస్టల్) ఎంకే ఆదిత్య ప్రథమ బహుమతి, ఎ. రవితేజ రెండో బహుమతి, స్లోగన్ రచనల్లో శ్రేష్ట భారత్‌లో ప్రథమ బహుమతి గీతాన్విత, రెండో బహుమతి కే మాధవి సొంతం చేసుకున్నారు. రోల్‌ప్లే (భారత దేశ సంస్కృతి చరిత్ర, విలువలు) పోటీలో హసీఫా, పి. యాస్మిన్, టి. అభినవ్ గెలుపొందారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి, శిక్షణా శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు నగరంలోని బీ.క్యాంపు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కాలేజీలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల అన్నారు. ఎల్‌అండ్ టీ, టాటా, కేవెల్ గ్రూప్ సంస్థలు పాల్గొంటాయని అన్నారు. పదో తరగతి నుంచి పీజీ చదివినవారు, 35 సంవత్సరాలలోపు ఉన్న వారు అర్హులని అన్నారు. జాబ్‌మేళాలో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు నెలకు రూ.18వేలు జీతం ఉంటుందన్నారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 905952 4482, 7780478910 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సుకన్య సమృద్ధి ఖాతాపై ప్రత్యేక డ్రైవ్

కర్నూలు న్యూసిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో సుకన్య సమృద్ధి ఖాతాపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసులలో నిర్వహించే డ్రైవ్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాలికల ప్రయోజనార్థం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి ఖాతా 10 సంవత్సరాలలోపు బాలికలందరకీ రూ.250 నామమాత్రపు రుసుముతో దగ్గరిలోని పోస్టాఫీసుల్లో ఖాతా తెరవవచ్చన్నారు.

డిగ్రీ 3వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 3వ సెమిస్టర్ ఫలితాలను ఉప కులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ విడుదల చేశారు. బుధవారం ఉపకులపతి తన చాంబర్‌లో పరీక్షల విభాగం డీన్‌తో కలిసి ఫలితాలను విడుదల చేశారు. 856 మంది పరీక్షలు రాయగా 574 మంది ఉత్తీర్ణత సాధించారని, 67 శాతం నమోదైందని పరీక్షల విభాగం డీన్ కే. నాగరాజు శెట్టి తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ఫిబ్రవరి 3లోపు రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ కే బాలసుబ్రమణ్యం, జూనియర్ అసిస్టెంట్ పి. వెంకటరమణయ్య పాల్గొన్నారు.

26న క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్ఆర్‌సీ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేథ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490336550ను సంప్రదించాలన్నారు.

ప్రగతి సాధించాలి

-నీతి అయోగ్ అడిషనల్ మిషన్ డైరెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్ష హార్ట్ కార్యక్రమాలపై పూర్తి వారాంతపు కార్యక్రమాన్ని రూపొందించుకుని ప్రగతి సాధించాలని నీతి అయోగ్ అడిషనల్ మిషన్ డైరెక్టర్ మహేంద్ర కుమార్ అధికారులను సూచించారు. జిల్లాలోని మూడు ఆస్పిరేషన్ బ్లాకులైన హొళగుంద, చిప్పగిరి, మద్దికెరలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ మ్యాపింగ్‌పై బుధవారం అధికారులతో ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ పి.రంజిత్ బాషా, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

(3వ పేజీ తరువాయి)

దోమల నియంత్రణకై ఫాగింగ్ యంత్రాలను వినియోగించాలన్నారు. కాలినడకన తరలివచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి మందులను అందుబాటులో ఉంచాలన్నారు. భీమునికొలను, కైలాసద్వారం ప్రాంతాల్లో ప్రమాదానికి గురైన బాధితుల కొరకు స్ట్రచర్లను, అంబులెన్స్‌లను సిద్ధం చేయాలన్నారు. హోటళ్లలో విక్రయించే తినుబండాల శాంపిల్స్ సేకరించి తనిఖీ చేసి, ధరల పట్టికలను ఏర్పాటు చేయించాలని సివిల్ సప్లై, లీగల్ మెట్రాలజీ అధికారులను ఆదేశించారు. నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేందుకు జనరేటర్లను సమకూర్చుకోవాలన్నారు. శ్రీశైలం మార్గంలో ఉండే అటవీ చెక్‌పోస్టుల్లో వాహనాలకు రుసుము మినహాయిస్తున్నట్లు తెలిపారు. అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు మాట్లాడుతూ.. సుమారు 3వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అన్ని సదుపాయాలు కల్పించాలి
- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గతంలో జరిగిన చిన్నచిన్న పొరపాట్లను గుర్తించి వాటిని సరిచేసుకోవాలని సూచించారు. అటవీ, పోలీసు శాఖల సమన్వయమై సాక్షిగణపతి సమీపంలో ట్రాఫిక్‌జామ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనాన్ని కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో శ్రీశైలం సబ్ డీఎఫ్‌ఓ మహ్మద్ అన్సర్‌అలీ, సబ్ కలెక్టర్ సాధిక్ త్రివినాధ్, ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్, ఆర్డీవో నాగజ్యోతి పాల్గొన్నారు.

పని విభజనపై సబ్ కమిటీ ఏర్పాటు

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీసీఎల్ఏ అధికారి జయలక్ష్మి
- హాజరైన కలెక్టర్, జేసీ, ఇన్‌చార్జి డీఆర్వో



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో అధికారాల పంపిణీ, పని విభజన, బాధ్యతలను రివైజ్ చేయాల్సి ఉందని, ఈ అంశాన్ని అధ్యయనం చేసేందుకు గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల కలెక్టర్లతో సబ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు సీసీఎల్ఏ అధికారి జయలక్ష్మి తెలిపారు. విజయవాడ నుంచి కలెక్టర్లతో సీసీఎల్ఏ అధికారుల పంపిణీ పని విభజన అంశాలపై గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కలెక్టర్, జేసీ, డీఆర్వో, సబ్ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ల స్థాయిలో అధికారాల పంపిణీ, పని విభజన, బాధ్యతలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సబ్ కమిటీలో ఉన్న గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రంజిత్ బాషా, జేసీ డా.బి.నవ్య, ఇన్‌చార్జి డీఆర్వో బీకే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రూ.291.67 కోట్లతో

నగర పాలక సంస్థ బడ్జెట్

కర్నూలు న్యూసిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర పాలక సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌ను బుధవారం స్థాయి సంఘం ఆమోదించింది. నగర పాలక కార్యాలయంలో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. రూ.291.67 కోట్లతో బడ్జెట్ రూపకల్పన చేశారు. మొత్తం ఆదాయం రూ.363.99 కోట్లు, ఖర్చు రూ.291.67 కోట్లు, రెవెన్యూ ఆదాయం రూ.201.22 కోట్లు, ప్రభుత్వ గ్రాంట్లు రూ.162.77 కోట్లు, మూలధన రాబడి రూ.138.69 కోట్లు, నికర మిగులు రూ.72.31 కోట్లుగా అంచనాలు తయారు చేశారు. అదే విధంగా రెండు తీర్మానాలకు స్థాయి సంఘం ఆమోదం తెలిపింది. అమృత్-2 పథకంలో భాగంగా 19వ వార్డులోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ పబ్లిక్ పార్కు, 45వ వార్డులోని టీచర్స్ కాలనీ పబ్లిక్ పార్కుల నిర్వహణ బాధ్యతలను పొదుపు సంఘాలకు కేటాయించి ఏడాది కాలానికి ఒక్కో పార్క్‌కు రూ.4.90 లక్షలు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. 200 మంది తాత్కాలిక పారిశుధ్య కార్మికులకు గత ఏడాది డిసెంబరు 17 నుంచి ఈ ఏడాది జనవరి 31 నాటికి రూ.42.93 లక్షల వేతనాలు చెల్లింపునకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్. రవీంద్రబాబు, సభ్యులు జుబేర్, యూనుస్, క్రాంతి కుమార్, మిద్దె చిట్టెమ్మ, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, అకౌంట్స్ అధికారి చుండీ ప్రసాద్, ఆరోగ్య అధికారి కే. విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్‌వోలు జునైద్, ఇశ్రాయేలు, టీపీఆర్‌వో వెంకటలక్ష్మి, ఎగ్జామినర్ సుబ్రహ్మణ్యం, అకౌంట్స్ అధికారులు శభానా, మల్లికార్జున, క్లర్క్ జీఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

12వ రోజు 286 మంది ఎంపిక



లాంగ్ జంప్‌లో పాల్గొన్న అభ్యర్థి

కర్నూలు క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు బుధవారం 12వ రోజు కొనసాగింది. స్థానిక ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలను ఎస్పీ జి. బిందుమాధవ్ పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 415 మంది బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ, ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు పరీక్షలో 323 మంది, 100 మీటర్ల పరుగులో 190 మంది, లాంగ్‌జంప్‌లో 281 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 12వ రోజు 286 మంది అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకున్న మంత్రి

- ప్రమాదంలో గాయపడ్డ మహిళను ఆసుపత్రిలో చేర్చిన బీసీ
- మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు



గాయపడిన మహిళకు వైద్యం చేయిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పాణ్యం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహిళను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సకాలంలో ఆసుపత్రికి తరలించి వైద్య సేవలందించారు. బుధవారం హైదరాబాదు నుంచి బనగానపల్లెకు తన వాహనంలో వెళ్తుండగా తమ్మరాజు పల్లె ఘాట్‌లో పాణ్యం మండలం కొనిదేడు గ్రామానికి చెందిన సరస్వతి, మరో వ్యక్తి మోటారు సైకిల్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడినట్లు గమనించారు. వెంటనే తన ఎస్కార్టు వాహనంలో మహిళను తీసుకువెళ్లి పాణ్యంలోని సీహెచ్‌సీలో చేర్పించి వైద్య సేవలందించారు. మహిళకు ముక్కు, చెవుల నుంచి రక్తస్రావం కావడంతో ఆసుపత్రిలో స్కానింగ్ సౌకర్యం లేకపోవడంతో హుటాహుటిన శాంతిరాం ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలందించాలని ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డిని ఆదేశించారు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వాహనంలో తరలించారు.

ఘనంగా నరహరి తీర్థుల ఆరాధన



నరహరితీర్థుల బృందావనానికి హారతులు ఇస్తున్న పీఠాధిపతి


మంత్రాలయం జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మధ్వాచార్యుల ప్రథమ శిష్యుడు నరహరితీర్థుల ఉత్తర ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం కర్ణాటకలోని హంపీ సమీపంలో తుంగభద్ర నది మధ్యలో వెలసిన నరహరి తీర్థుల మూల బృందావనం వద్ద పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నిర్మల విసర్జనం, తులసి అర్చన, పంచామృతాభిషేకం, మూల రాములకు పూజలు చేశారు. అనంతరం మహా మంగళహారతులు ఇచ్చి సంస్థాన పూజ చేశారు. అక్కడుండే వందలాది మంది భక్తులకు ముద్ర ధారణ చేసి ఆశీర్వదించారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

రుద్రవరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరినగరం గ్రామ సమీపంలో కోడి పందేలు ఆడుతుండగా ఎస్ఐ వరప్రసాద్ బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో కడప, నంద్యాల జిల్లాలకు చెందిన 11 మంది కోడిపందేల నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కడప జిల్లాకు చెందిన సుద్దపల్లె, నంద్యాల జిల్లాకు చెందిన రుద్రవరం, గోవిందపల్లె, ఆళ్లగడ్డ, బాచుపల్లె, రామచంద్రపురం గ్రామాలకు చెందిన 11 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న రెండు కోళ్లు, రూ.43400 నగదు, 10 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

- నగరంలో కాంగ్రెస్ భారీ పాదయాత్ర



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ

కర్నూలు అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి, జిల్లా కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి అంబటి రామకృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో భాగంగా భారీ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా కొండారెడ్డి బురుజు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని మర్చేయాలని ఉద్దేశంతో ఉందని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళల హక్కులను కాలరాయలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. రాహుల్‌గాంధీ చేపట్టిన సంవిధాన్ బచావోలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగ రచయిత అంబేద్కర్‌ను అవమానించడమంటే యావత్ దేశ ప్రజలను అవమానించినట్లేనని, అమిత్‌షా తన మాటలు వెనక్కి తీసుకొని స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతక ముందు జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం నుంచి నెహ్రూ రోడ్డు, చౌక్ బజార్, గడియారం హాస్పిటల్, పెద్ద మార్కెట్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్ వద్దకు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, నియోజకవర్గం ఇన్‌చార్జి ఎం.ఖాసీం వలీ, చిప్పగిరి లక్ష్మీ నారాయణ, జి.రమేష్ యాదవ్, బి.క్రాంతినాయుడు, పి.మురళీకృష్ణంరాజు, ఓబీసీ చైర్మన్ డీవీ సాంబశివుడు, ఐన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బీ.బ్రతుకన్న తదితరులు పాల్గొన్నారు.

అరటి సాగులో రికార్డు

- 30 కేజీల అరటి గెల
- ఆదర్శంగా నిలిచిన రైతు చంద్ర ఓబుళరెడ్డి

చాగలమర్రి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి గ్రామానికి చెందిన రైతు చంద్ర ఓబుళరెడ్డి అరటి సాగులో జిల్లాలోనే రికార్డు సాధించి ఆదర్శంగా నిలిచాడు. ఆయన మూడెకరాల్లో 3,500 అరటి పిలకలు నాటి ఏడాది పాటు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాడు. సాధారణంగా 15 నుంచి 18 కేజీల అరటి గెల మాత్రమే వచ్చేది. ప్రస్తుతం 30 కేజీల బరువుగల అరటి గెల కాపు వచ్చింది. సాధారణంగా గెలకు 7 నుంచి 9 పెన్నలు మాత్రమే వస్తాయి. ఈ గెలకు 10 నుంచి 12 పెన్నలు కాపు వచ్చింది. అరటి తోటలోని చెట్లకు 90 శాతం 30 కేజీల బరువుగల గెలలు దిగుబడి రావడంతో టన్ను ధర అధికంగా ఉండటంతో తన కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని రైతు చంద్ర ఓబుళరెడ్డి ఆనందం వ్యక్తం చేశాడు. మొదటి కోతలోనే మూడెకరాలకు రూ.3 లక్షలు పెట్టుబడి పోను రూ.లక్ష ఆదాయం వచ్చిందని అన్నారు. గత ఏడాది అరటి టన్ను ధర రూ.16 వేలు నుంచి రూ.18 వేలు మాత్రమే ఉండేదని, ఈ ఏడాది రూ.20 వేలు నుంచి రూ.24 వేలు ధర పలకడంతో పెట్టుబడి పోను ఆదాయం వచ్చిందని అన్నారు.



చిన్నవంగలిలో అరటి గెలను చూపిస్తున్న రైతు చంద్ర ఓబుళరెడ్డి

ఉపాధ్యాయుడి వికృత చేష్టలు

- బాలికల పట్ల అసభ్య ప్రవర్తన
- తల్లిదండ్రుల ఆందోళనతో సస్పెండ్ చేసిన అధికారులు



పాఠశాల వద్ద ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు

కోడుమూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు సభ్యత మరిచాడు. అక్షరాలు నేర్పాల్సిన చేతితో బ్యాడ్ టచ్ చేస్తూ వికృతానందం పొందాడు. గురువు ప్రవర్తన పట్ల విసుగు చెందిన బాలికలు తల్లిదండ్రులకు తెలపడంతో విషయం వెలుగుచూసింది. మండలంలోని వెంకటగిరి ప్రాథమిక పాఠశాల (స్పెషల్)లో సుమారు 38 మంది బాలబాలికలు విద్యనభ్యసిస్తున్నారు. 1 నుంచి 5 తరగతుల బోధనకు ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. పాఠశాలకు 2023లో లక్ష్మన్న అనే టీచర్ బదిలీపై వచ్చాడు. సదరు ఉపాధ్యాయుడు బాలికలపై ఎక్కడపడితే అక్కడ చేతులు వేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. రానురాను ఉపాధ్యాయుడి వికృత చేష్టలు పెరిగిపోవడంతో బాలికలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక బాధను దిగమింగుకున్నారు. ఆరు నెలల క్రితం ఓ ఇద్దరు పిల్లలు తల్లిదండ్రులకు తెలపడంతో వారు వెళ్లి మందలించినట్లు తెలిసింది. అప్పట్లో సమస్యను పెద్దగా పట్టించుకోకపోవడంతో సమసిపోయింది. అయినా ఉపాధ్యాయుడి ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను బడి మాన్పించి మరోచోట చేర్చారు. ప్రవర్తనలో మార్పురాని ఉపాధ్యాయుడు అదే రీతిలో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో రెండు రోజులుగా పలువురు బాలికలు బడికి వెళ్లబోమని తల్లిదండ్రులతో చెప్పారు. ఆరా తీయగా ఉపాధ్యాయుడి వికృత చేష్టలను వివరించారు. కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు, గ్రామస్థులు బుధవారం ఉదయం పాఠశాల వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయుడిపి గదిలో బంధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, మండల విద్యాశాఖాధికారులు వసంతలక్ష్మి, తైమూర్‌బాషా అక్కడికి చేరుకుని గ్రామస్థులను శాంతింపజేశారు. బాలికలను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం ఎస్‌ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

కోట్ల సర్కిల్‌లో రాస్తారోకో..

వెంకటగిరి పాఠశాలలో ఉపాధ్యాయుడు లక్ష్మన్న బాలికల పట్ల లైంగిక వేధింపులకు గురి చేస్తుండడంతో ఏఐఎస్ఎఫ్, సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఉపాధ్యాయుడి ప్రవర్తన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, చర్యలు తీసుకోవాలని నినదించారు. మరలా పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఉపాధ్యాయుడిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు..

వెంకటగిరి ప్రాథమిక పాఠశాల(స్పెషల్)లో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. కాగా మండల విద్యాశాఖాధికారుల నివేదిక మేరకు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈవో శ్యామ్యూల్ పాల్ ఉత్తర్వులు వెలువరించారు.

రైతు ఆత్మహత్య

- అప్పుల బాధతో బలవన్మరణం



గిడ్డయ్య (ఫైల్)

కోడుమూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి గ్రామంలో అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన రైతు జల్లి గిడ్డయ్య (42)కు మూడె కరాల పొలం ఉంది. ఆయన కొన్నేళ్లుగా ఉల్లిసాగు చేస్తున్నాడు. అయితే అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల వల్ల దిగుబడి రాకపోవడం, దిగుబడి వచ్చినప్పుడు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో నష్టాల పాలయ్యాడు. ఈ ఏడాది అధిక వర్షాలతో ఉల్లి గడ్డలు కుళ్లిపోయి నష్టం వచ్చింది. పంట సాగుకు రూ.10లక్షలు అప్పు మిగలడంతో దిక్కు తోచని పరిస్థితి ఏర్పడింది. దీంతో మంగళవారం రాత్రి ఇంటి పక్కన రేకుల షెడ్డులో ఉరివేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బైక్ పై నుంచి పడి మహిళ మృతి

మంత్రాలయం జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన జేరుబండి శారదమ్మ (40) బుధవారం మోటారు సైకిల్ నుంచి కింద పడి మృతి చెందింది. హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు వివరాల మేరకు.. శారదమ్మ, భర్త లక్ష్మన్న కలిసి హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. సరుకుల కోసం వీరిద్దరు బైక్‌పై కోసిగి వెళ్తుండగా మాధవరం స్టీల్ ఫ్యాక్టరీ వద్ద మృతురాలి చీర బండి చక్రాల్లో పడింది. దీంతో ఆమె కిందపడి తలకు తీవ్ర గాయాలపాలైంది. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బంకర్ కూలి బీహార్ వాసి మృతి

బనగానపల్లె, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్‌లో బంకర్ కూలడంతో బీహార్ వాసి మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ దుగ్గిరెడ్డి వివరాల ప్రకారం.. బనగానపల్లె పట్టణ శివారులోని శ్రీనివాస రైస్ మిల్‌లో వడ్లు స్టోరేజ్ చేసేందుకు ఇటీవలే బంకర్లు ఏర్పాటు చేశారు. బీహార్‌కు చెందిన హమాలీలు రైస్‌మిల్‌లో పనిచేస్తుండగా బంకరు ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో బీహార్‌కు చెందిన సుజీత్‌కుమార్ (26)అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు బీరేంద్రషా, సహానిధశరథ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. సుజీత్‌కుమార్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతి చెందిన సుజీత్‌కుమార్ మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీకి విఫల యత్నం

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెస్ నగర్‌లోని ఓ ఇంట్లో దొంగ చోరీకి విఫలయత్నం చేశాడు. స్థానికులు మెల్కొనడంతో పారిపోయాడు. కాలనీ వాసుల వివరాల మేరకు.. ఇంటి యజమాని వారి బంధువుల ఫంక్షన్‌కు వెళ్లగా ఓ గుర్తు తెలియని దొంగ కాలనీలో మోటార్ సైకిల్ వేసుకొని సంచరించాడు. మోటార్ సైకిల్‌ను వీధి చివరన ఉంచి ఓ ఇంట్లో మొబైల్ లైట్‌తో తాళం వేసిన ఇంటిని చూశాడు. ఆ తాళాన్ని పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలను పగలగొట్టే క్రమంలో అప్పటికే పసిగట్టిన కాలనీ వాసులు దొంగను పట్టుకునేందుకు వెళ్లారు. ఇది గమనించిన దొంగ ఇంట్లోని మెట్లు ఎక్కి మిద్దెపైకి వెళ్ళి పారిపోయాడు. ఇంతలో చుట్టు పక్కల వాళ్లు వెంటనే ఇంటి యజమానికి సమాచారం ఇచ్చారు. యజమాని అర్ధరాత్రి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొంగ వదిలేసి వెళ్లిన మోటార్ సైకిల్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కన్నీటి వేదన

- కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం
- ముగ్గురు సంస్కృత పాఠశాల విద్యార్థులు, డ్రైవర్ మృతి
- సీఎం, డిప్యూటీ సీఎంల దిగ్భ్రాంతి
- కన్నీరు పెట్టుకున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం సింధనూరులో మంగళవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంత్రాలయం నుంచి వేద విద్యార్థులతో వెళ్తున్న తుఫాన్ వాహనం ఎక్సెల్ రాడ్డు విరిగి బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు. వీరిలో మంత్రాలయం సంస్కృత పాఠశాలకు చెందిన ముగ్గురు వేద విద్యార్థులతో పాటు డ్రైవర్ ఉన్నాడు. మధ్వాచార్యుల ప్రత్యక్ష ప్రథమ శిష్యులైన నరహరితీర్థుల ఉత్తరాధన పూజల కోసం మంత్రాలయం నుంచి 20 వాహనాల్లో వేద విద్యార్థులు, మంత్రాలయ పట్టణ ప్రముఖులు, నాయకులు, మఠం సిబ్బంది కలిసి దాదాపు 300 మంది హంపికి మంగళవారం రాత్రి బయలుదేరి వెళ్లారు. అయితే ఒక తుఫాన్ వాహనంలో 13 మంది గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల వేద విద్యార్థులు ఉన్నారు. సింధనూరు సమీపంలోని పోతనాల గ్రామం వద్ద తుఫాన్ వాహనం ఎక్సెల్ రాడ్డు విరగడంతో ప్రధాన రోడ్డుపై మూడు పల్టీలు కొట్టింది. దీంతో మంత్రాలయానికి చెందిన డ్రైవర్ కంసాలి శివ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. మంత్రాలయానికి చెందిన గుంజెల్లి సుజయీంద్ర (22), బళ్లారికి చెందిన హయవదన (19), కొప్పల్‌కు చెందిన అభిలాష (20) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. బళ్లారికి చెందిన మరో వేద విద్యార్థి జయసింహ పరిస్థితి విషమంగా ఉంది. ఇదే వాహనంలో ప్రయాణిస్తున్న కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణకు చెందిన పది మంది వేద విద్యార్థులు శ్రీహరి, విజయేంద్ర, భరత్, రాఘవేంద్ర, తణిష్, శ్రీకర, వాసుదేవ, భసంత శర్మ, రాఘవేంద్ర, జయసింహలకు తీవ్ర గాయాలు కావడంతో సింధనూరు ఆసుపత్రికి తరలించారు. ఇందులో జయసింహ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం రాయచూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను తమ సొంత గ్రామాలైన మంత్రాలయం, బళ్లారి, కొప్పల్‌కు తరలించారు. వీరికి లింగసూగూరు డీఎస్పీ దత్తాత్రేయ కర్నాడు, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి దగ్గరుండి వైద్యసేవలు చేయించారు. సంస్కృత పాఠశాల విద్యార్థులు నలుగురు మృతి చెందడంతో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కన్నీరు పెట్టుకున్నారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, మఠం అండగా ఉంటుందన్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం

మంత్రి బీసీ విచారం

బనగానపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వేద పాఠశాల విద్యార్థుల మృతిపై రోడ్లు భవనాల శాఖా మంత్రి బుధవారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వేద విద్యార్థులు, డ్రైవర్‌కు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కర్ణాటక ప్రభుత్వాన్ని మంత్రి కోరారు. మృతి చెందిన కుటుంబాలకు ఎన్‌డీఏ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

ఎంపీ బస్తిపాటి దిగ్భ్రాంతి

కర్నూలు అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వేద పాఠశాలకు చెందిన విద్యార్థులు మృతి చెందడంపై ఎంపీ బస్తిపాటి నాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దైవ కార్యాక్రమానికి వెళ్తున్న సమయంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. మృతులకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నానని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వంతో పాటు పాటు తాను కూడా అండగా ఉంటానని చెప్పారు.

ప్రముఖుల సంతాపం

మంత్రాలయం చెందిన నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటనపై ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, సిద్దరామయ్య, రేవంత్ రెడ్డిలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి, మేనేజర్ సురేష్ కోనాపూర్‌లు సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ3. లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబాలకు అండగా ఉంటామని కర్ణాటక సీఎం హామీ ఇచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ఆదేశాలు జారీ చేశారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్ట నిర్వహించి మృతదేహాలను తమ సొంత గ్రామాలైన మంత్రాలయం, బళ్లారి, కొప్పల్‌కు తరలించారు.



హంపీలో విచారం వ్యక్తం చేస్తున్న పీఠాధిపతి



బాధితుల తల్లిదండ్రులతో



సంఘటనా స్థలంలో బోల్తాపడ్డ వాహనం

శవమై వచ్చాడు...




హయవదన మృతదేహం

శాస్త్రాలు చదివి గొప్ప పాండిత్యంతో తిరిగి వస్తాడని ఆశపడితే శవమై వచ్చాడు. అర్చకుడుగా పని చేస్తూ నా కుమారుడు శాస్త్రాలను చదువుతాడని ఆశిస్తే దేవుడు చిన్న చూపు చూశాడు. కొడుకు లేని జీవితం ఎలా గడపాలి.

- హయవదన తండ్రి ప్రహ్లాదాచార్(బళ్లారి)

దేవుడు చిన్న చూపు చూశాడు



అభిలాష మృతదేహం

దేవుడు మాపై చిన్న చూపు చూశాడు. ఉన్న ఒక్క కొడుకును వేద పాఠశాలకు పంపిస్తే మృత్యువు కబళించిది. మా కుటుంబాన్ని తీరని శోకం మిగిల్చింది. మా కొడుకు లేని మా జీవితం ఎలా. ఆ బాధను తట్టుకోలేకపోతున్నాం.

- అభిలాష తండ్రి అశ్వత్ కొప్పల్, కర్ణాటక

వేద పండితుడు అవుతాడనుకున్నాం



సుజయీంద్ర మృతదేహం

ఉన్న ఒక్క కొడుకు వేద పండితుడు అవుతాడని ఆశపడ్డాం. ఆరేళ్ల చదువు పూర్తయింది. మరో ఆరేళ్ల చదవాల్సి ఉండగా మృత్యువాత పడటం గుండె కోత మిగిల్చింది. ఉన్న ఒక కొడుకుపై పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి.

- సుజయీంద్ర తల్లిదండ్రులు కృష్ణమూర్తి, జానకి, మంత్రాలయం

నలుగురు కొడుకుల్లో ఇద్దరు ప్రమాదంలోనే..



డ్రైవర్ కంసాలి శివ

నలుగురు కొడుకుల్లో ఇద్దరు ప్రమాదంలోనే మృతి చెందారు. మూడో కుమారుడు పవన్ వినాయక చవితిలో విద్యుదాఘాతనికి గురై మృతి చెందాడు. ఇప్పుడేమో ఆఖరి కొడుకు శివ మృతి చెందాడు. ఇద్దరు కొడుకులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నాం.

- డ్రైవర్ శివ తండ్రి సోమన్న

పత్తి జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

(3వ పేజీ తరువాయి..)

మార్కెట్ యార్డులోని అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలం చేరుకొని సహాయక పనుల్లోకి దిగారు. అయినా మంటలు అదుపులోకి రాలేదు. ఆదోని రెండు ఫైర్ ఇంజన్లతో పాటు ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ నుంచి కూడా ఫైర్ ఇంజన్లు తెప్పించి 40-45 మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. భారీ ప్రమాదం కావడంతో స్థానిక అగ్ని మాపక విభాగం ఫైర్ ఆఫీసర్ రామాంజనేయులు సమాచారం మేరకు అగ్ని మాపక శాఖ రీజినల్ ఫైర్ ఆఫీసర్ (ఆర్ఎఫ్ఓ) భూపాల్‌రెడ్డి, డీఎఫ్ఓ అవినాశ్ జయసింహ ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. రాత్రి 9.30 గంటలు దాటినా పరిస్థితి అదుపులోకి రాలేదు. సహాయక చర్యలు కొనసాగుతునే ఉన్నాయి.

రూ.10 కోట్లకుపైగా నష్టం..

సంతోష్ జిన్నింగ్ మిల్లులో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో రూ.10 కోట్లకు పైగా నష్టం జరిగి ఉంటుందని అనధికారిక అంచనా. రూ.1.80 కోట్ల విలువైన 600 పత్తిదూది బేళ్లు (ఒక్కో బేలు 170 కిలోలు), రూ.2 కోట్లకు పైగా విలువైన పత్తి చెక్కులు, రూ.కోటికి పైగా విలువ చేసే పత్తి గింజలతో పాటు విలువైన టీఎంసీ కాటన్ జిన్నింగ్, ప్రెస్సింగ్ యంత్ర సామగ్రి, ఇతర పరికరాలు, మిల్లు మొత్తం కాలిబూడిదైందని మిల్లు యజమాని ప్రశాంత్ కన్నీరుమున్నీరయ్యారు. దాదాపుగా రూ.9-10 కోట్లకుపైగా నష్టం వాట్లిందని వాపోయారు. మూడు నాలుగేళ్లలో పత్తి మిల్లుల్లో జరిగిన ప్రమాదాలతో పోలిస్తే ఇదే అతిభారీ ప్రమాదమని స్థానికులు అంటున్నారు. 2021 మార్చి 29న ఆస్పరి రోడ్డులోని వెంకటలక్ష్మి, తిరుపతమ్మ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.60 వేలు నష్టం జరిగింది. 2023 జనవరిలో సంతోష్ పత్తి మిల్లులో జరిగిన ప్రమాదంలో రూ.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. 2023 అక్టోబరులో బసవేశ్వర కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్లులో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.50 లక్షలకు పైగా నష్టం జరిగింది. అత్యంత భారీ అగ్ని ప్రమాదం ఇదేనని, పూర్తిగా మిల్లు కాలిబూడిదైందని స్థానికులు పేర్కొన్నారు.



మిల్లులో వ్యాపించిన మంటలు

భారీ ప్రమాదం ఇది

సంతోష్ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సిం గ్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. నాలు గైదేళ్లలో ఇదే భారీ ప్రమాదం. పత్తి, దూదితో పాటు యంత్రాలు, బిల్లు పూర్తిగా కాలిపోయింది. రాత్రి 10 గంటల వరకు మంటలు అదుపులోకి రాలేదు. ఐదు ఫైర్ ఇంజన్లు, 40 మందికి పైగా సిబ్బందితో మంటలు ఆర్పే పనుల్లో నిమగ్నమయ్యాం. పూర్తిగా అదుపులోకి వచ్చాక, యాజమాన్యం రికార్డులు పరిశీలించి ఎంత నష్టం జరిగిందీ అంచనా వేస్తాం. **- అవినాశ్ జయసింహ, డీఎఫ్‌వో, అగ్నిమాపక శాఖ, కర్నూలు**

చూస్తుండగానే మంటలు వ్యాపించాయి



సంతోష్ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్లుకు ఏపీ21 టీడబ్ల్యూ 4645, మరో వాహనం ఏపీ 39 వీబీ 0858లో 50 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి రైతులతో పాటు వచ్చాం. ధర మాట్లాడి అన్‌లోడ్ చేసేందుకు మిల్లు లోపలికి వెళ్లాం.విద్యుత్ వైర్ల నుంచి నిప్పులు పత్తిపై పడ్డాయి. క్షణాల్లో మంట మిల్లు మొత్తం వ్యాపించింది. ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశాం. అగ్ని ప్రమాదంలో మా రెండు వాహనాలు కూడా కాలిబూడిదయ్యాయి. ఆ వాహనాలే మాకు జీవనాధారం. **- నారాయణ, పత్తి లారీ ఓనర్, బస్సాపురం, ఆదోని మండలం**



రూ.10 కోట్ల వరకు నష్టం

మధ్యాహ్నం సమయంలో పరిశ్రమలు 50 మందికి పైగా ఉన్నాం. జిన్నింగ్, ప్రెస్సింగ్ పనులు జరుగుతున్నాయి. పత్తి దూది బేళ్ల కొనుగోలు చేసేందుకు కొందరు వచ్చారు. వారితో మాట్లాడుతున్నాం. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్ వల్ల నిప్పు రవ్వలు పత్తి, దూదిపై పడడంతో మంటలు వ్యాపించాయి. పరిశ్రమ మొత్తం కాలిబూడిదైంది. సుమారు రూ.10 కోట్లకు పైగా నష్టం జరిగింది.

- ఎన్.ప్రశాంత్, పరిశ్రమ యజమాని, ఆదోని

ట్రాఫికర్..

● ఆస్పత్రి ఎదుట దుకాణాలు
● ఇబ్బంది పడుతున్న రోగులు, సహాయకులు
● నగర పాలక సంస్థ, ఆసుపత్రి అధికారుల ఉదాసీనత

కర్నూలు న్యూసిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఆసుపత్రి ప్రధాన రహదారి వద్ద వివిధ వాహనాలతో రద్దీగా ఉంటుంది. దీనికితోడు అక్కడ దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసుకున్నారు. అంబులెన్సులు లోపలికి రావాలంటే కనీసం పదినిమిషాల సమయం పడుతుంది.



దుకాణాల ముందు బారులుదీరిన ఆటోలు

● **యథేచ్ఛగా దుకాణాలు..** ఆసుపత్రికి లోపలికి వెళ్లే పాత గేటు నుంచి కొత్త గేటు వరకు అనుమతి లేకుండా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను గత సంవత్సరం నగర పాలక కమిషనర్ ఏ. భార్గవతేజ ఆదేశాలతో తొలగించారు. తాము 30 సంవత్సరాలుగా అక్కడే వ్యాపారాలు చేసుకుంటున్నామని...తమ కడుపులు కొట్టొద్దంటు ప్రజాదర్బార్‌లో వినతులు సమర్పించారు. అయినా కమిషనర్ ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదు. ఈ క్రమంలో దుకాణాలు కాకుండా చిన్నగా తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకున్నారు. కాలక్రమేణా అవి దుకాణాలుగా మారాయి. ఇదంతా నగర పాలక, ప్రభుత్వ ఆసుపత్రి అధికారులు చూస్తున్నా కూడ ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. పైగా అప్పటి వైసీపీ ప్రజాప్రతినిదులు కమిషనర్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు. చిరు వ్యాపారులంతా తమకు సంబంధించిన వారేనని... నచ్చజెప్పినట్లు తెలిసింది.

● **రోగుల ఇబ్బందులు..** ప్రభుత్వ ఆసుపత్రి పాతగేటు నుంచి కొత్త గేటు వరకు సుమారు 30 దుకాణాలు ఉన్నాయి. దీనికి తోడు ఆటోలు కూడా అక్కడే నిలబెట్టుకోవడం...ఇతర వాహనాలు ఇక్కడే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యతో రోగులు, సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఆస్పతి ముందు నిలిచిన వాహనాలు

● **పట్టించుకోని పోలీసులు..** ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులను దృష్టిలో ఉంచుకొని పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించడంలో ఘోరంగా విఫలం చెందినట్లు స్పష్టంగా తెలుస్తోంది. నగరంలో ట్రాఫిక్‌కు సంబంధించి ప్రత్యేక పోలీసు బలగమే ఉంది. అయితే వీరంతా ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదు.

త్వరలోనే కార్యాచరణ రూపొందిస్తాం

కమిషనర్‌తో చర్చించి త్వరలోనే కార్యాచరణ రూపొందిస్తాం. పోలీసుల సహకారంతో అక్కడ ఉన్న దుకాణాలను తొలగిస్తాం. రాజ్‌విహార్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను తొలగించే ఆలోచనలో ఉన్నాం.

- ప్రదీప్‌కుమార్, సిటీ ప్లానర్, నగర పాలక సంస్థ

చాలా కష్టంగా ఉంది

ఆసుపత్రిలోకి వెళ్లాలంటే ట్రాఫిక్, దుకాణాల వల్ల ఇబ్బందిగా ఉంది. కేసి కెనాల్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన గేటుకు రావడానికి నాకు పదిహేను నిమిషాలు సమయం పట్టింది. టూ వీలర్ కాబట్టి ఇంత సమయం పట్టింది. కలెక్టర్, నగర పాలక, ఆసుపత్రి అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలి.

- పద్మజ, గృహిణి

అల్ట్రా సౌండ్ స్కానింగ్‌కు అవస్థలు

టోకెన్‌లు లేవంటూ రోగులు వెనక్కి



అల్ట్రా సౌండ్ పరీక్షల కోసం వేచి చూస్తున్న రోగులు

కర్నూలు హాస్పిటల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): న్యూడయోగ్నస్టిక్ బ్లాకులో అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం వచ్చిన రోగులు అవస్థలు పడ్డారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ రోగులకు స్కానింగ్ పరీక్షలు న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ గ్రౌండుప్లోర్‌లో నిర్వహిస్తుంటారు. ప్రతిరోజు 400 మంది ఓపీ రోగులకు స్కానింగ్ పరీక్షలను వైద్యులు నిర్వహిస్తుంటారు. అల్ట్రాసౌండ్ పరీక్షల కోసం అక్కడ నియ మించిన ఓ స్టాఫ్ నర్సు టోకెన్‌ను జారీ చేస్తే వైద్యులు దాని ప్రాపదికన పరీక్షలు చేస్తారు. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఓపీ రోగులు టోకెన్ కోసం వెళ్లగా, అక్కడ ఎవరూ లేకపోవడంతో రోగులు వెనుదిరిగారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా సిటి మిషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి కోరారు. బుధవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో శిక్షణ అందించే వారి కోసం పేర్ల నమోదు కార్యక్రమాన్ని రెండో విడత బాలాభవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లంబింగ్, కార్పెంటరీ, ఎలక్ట్రికల్, వాటర్ ప్యూరిఫై సర్వీసెస్, ఏసీ మెకానిక్స్, రిఫ్రిజిరేటర్ రిపేర్, వాషింగ్ మెషిన్ సర్వీస్, టీవీ రిపేర్, బ్యూటిషియన్స్ అందరూ శిక్షణ కోసం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 200 మంది పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నైపుణ్య శిక్షణాభివృద్ధి సంస్థ సహకారంతో శిక్షణ అందిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెలా ఖరులోగా చిన్నపార్కు పక్కనే ఉన్న బాలాభవన్ మొదటి అంతస్తు మెప్మా కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వేదపాఠశాల విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కే.బలరాం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కర్ణాటక రోడ్డు ప్రమాదంలో మంత్రాలయం వేదపాఠశాలకు చెందిన విద్యార్థులు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని ఆయన కోరారు.

● కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంత్రాలయం వేద పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు, డ్రైవర్ మృతి చెందడం కలచివేసిందని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. హంపి క్షేత్ర పర్యటనకు వెళ్లిన వారి వాహనం సింధనూరు సమీపంలో ప్రమాదానికి గురై విద్యార్థులు మరణించడం బాధాకరమన్నారు.

బాధితులకు ప్రభుత్వం అండగా ఉండాలి

కర్నూలు కల్చరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా నిలవాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ వెంకటరామరాజు ఒక ప్రకటనలో కోరారు. కర్ణాటకలోని హంపి క్షేత్ర పర్యటనకు వెళ్లిన వారి వాహనం సింధనూరు సమీపంలో ప్రమాదానికి గురై వేద పాఠశాల విద్యార్థులు మరణించడం బాధాకరమని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

హామీలను నేరవేర్చాలి: పీడీఎస్‌యూ



మాట్లాడుతున్న ఆజాద్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నేరవేర్చాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు ఆజాద్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంటును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకాన్ని ఒక్కొక్క విద్యార్థికి రూ.18వేలు ఇస్తామని చెప్పి గాలికి వదిలేశారని అన్నారు. జీవో. నెం.77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, తిరుపాల్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోవాలి

సి.బెళగల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాబు కార్డు ఉన్న కూలీలంతా ఉపాధి పనులను వినియోగించుకోవాలని ఎంపీడీవో రాణెమ్మ సూచించారు. బుధవారం మండలంలోని ఇనగండ్ల, పోల కల్లు గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో రామన్న, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

నిందితుడు బీజేపీ అధ్యక్షుడా?

కర్నూలు న్యూసిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఓ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎలా నిమిస్తారని కుల వివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు ప్రశ్నించారు. బుధవారం బుధవారపేట సమితి కార్యాయలంలో ఆయన మాట్లాడుతూ కౌతాళం మండలం కామవరం గ్రామంలో 2022 జనవరి 27న దళితు లపై పట్టపగలే పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటనలో నిందితుడిగా ఉన్న వ్యక్తిని అధ్యక్షుడిగా నిమించడం దారుణమన్నారు. సమావేశంలో మాజీ జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు జి.కృష్ణ పాల్గొన్నారు.

ముంబైలో ఎంపీ బస్తిపాటి నాగరాజు



స్టాండింగ్ కమిటీ చైర్మన్‌తో కరచాలనం చేస్తున్న ఎంపీ నాగరాజు

కర్నూలు అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీపై మహారాష్ట్ర రాజధాని ముంబైలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రెండో రోజు బుధవారం అధ్యయన పర్యటన నిర్వహించింది. ఈ పర్యటనలో స్టాండింగ్ కమిటీ సభ్యులైన కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. ఇందులో భాగంగా కమిటీ చైర్మన్ కనిమొళీ కరుణానిధితో కలిసి సభ్యులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం అక్కడి అధికారులతో సమావేశమై వస్తువుల ప్రామాణి కరణ, మార్కెటింగ్, నాణ్యత, ధృవీకరణ కార్యకలాపాలపై చర్చించారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

ఓర్వకల్లు జనవరి 22(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని మీదివేముల గ్రామంలో జరుగుతున్న రీసర్వేను ఆయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 4వేల ఎకరాల భూమి ఉందని, అందులో 2వేల ఎకరాల్లో ఏపీఐఐసీకి కేటాయించామని అన్నారు. 2వేల ఎకరాల్లో సర్వే చేసేందుకు మూడు టీములు ఏర్పాటు చేశామని, రోజుకు ఒక టీమ్ 20 నుంచి 25 ఎకరాల వరకు సర్వే చేస్తారని అన్నారు. రీసర్వేలో ఐదుగురు వీఆర్వోలు, సర్వే డీటీ, ఏడుగురు సర్వేయర్లు ఉంటారన్నారు. రీసర్వే డీటీ షర్మిళా రెడ్డి, సర్వేయర్ శంకర్ మాణిక్యం, ఆర్ఐ పాణ్యం వెంకటేశ్వర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో రీసర్వేను రెవెన్యూ అధికారులు చేపట్టారు. ఈసందర్భంగా రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రీసర్వేకు ఏడు టీములుగా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తం, రీస ర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగ భూషణం, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.



మీదివేములలో రీసర్వే చేస్తున్న అధికారులు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ సునీల్ కుమార్

ఓర్వకల్లు జనవరి 22(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ సునీల్ కుమార్ అన్నారు. బుధవారం నన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 36వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు నన్నూరు టోల్‌ప్లాజా ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ సునీల్‌కుమార్ మాట్లాడు తూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాల న్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు హెడ్ మధుసూదన్, కటారుకొండ రంజిత్ రెడ్డి, ఆర్వోఎం నరేశ్వరరెడ్డి, టోల్ ప్లాజా మేనేజర్ రవిరంజన్, రంజిత్, సేఫ్టీ మేనేజర్ ఖాదర్‌వలి, ఆర్వో ఖుత్బుద్దీన్ బాషా, ప్లాజా సీవోఐసీ శంకర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు కూటమి ప్రభుతం పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి డిమాండ్ చేశారు. బుధవారం వారు కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల, ఉపాధ్యాయులకు సంబంధించి ఏపీజీఎల్ఐసీ, పీఎఫ్, ఈఐ బకాయిలను చెల్లించాలని, 2003లో ఉద్యోగ నియామకం పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని, కారుణ్య నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు హేమంత్ కుమార్, యెహోషువ, ఏటీ తిమ్మన్న, దుర్గప్రసాద్, సుధాకర్, హనుమన్న, సోమన్న, మారెప్ప, వెంకటేశ్, షౌకత్ ఆలి పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా బి.తాండ్రపాడు

కర్నూలు రూరల్ జనవరి 22(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం బి.తాండ్రపాడు ఆదర్శ గ్రామంగా ఎంపికైనట్లు ఎంపీడీవో రఘునాథ్ బుధవారం తెలిపారు. ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భం గా ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా బి.తాండ్రపాడు గ్రామ సర్పంచు ఆకెపోగు జయన్న అవార్డు అందుకోనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. గ్రామ పంచాయతీకి దాదాపు రూ.4కోట్ల వరకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి జరగడంతోనే ప్రభుత్వం తాండ్రపాడును ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్నపుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా బి.తాండ్రపాడు ఆదర్శ గ్రామంగా ఎంపికైన విషయం తెలిసిందే. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత మళ్లీ అదే గ్రామాన్ని రెండో సారి ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం గమనార్హం.

ఆర్‌యూ విద్యార్థికి బంగారు పతకం



విద్యార్థిని అభినందిస్తున్న ఆర్‌యూ ఉప కులపతి

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ కర్నూలు ఆధ్వర్యంలో ఈనెల 20న జరిగిన పారా స్పోర్ట్స్ పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థి బి.శ్రీనివాసులు డిస్కస్ త్రో ఈవెంటులో బంగారు పతకం దక్కించుకొని ఈ నెల 30న జరిగే రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఆర్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ విద్యార్థి బి.శ్రీనివాసులును అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుందరానంద్ పుచ్చ, యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ శివకిషోర్ పాల్గొన్నారు..

నేడు బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్ ఏరేనాలో గురువారం జిల్లా స్థాయి ఎంపిక నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి భానుప్రసాద్ తెలిపారు. ఎంపికైన బాల బాలికల జట్లు ఈ నెల 28 నుంచి 31వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాలని, వివరా లకు 9985161007ను సంప్రదించాలని సూచించారు.

గోదా గోకుల క్షేత్రంలో నిత్య కల్యాణం

కర్నూలు కల్చరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మామిదాలపాడులోని గోదారంగనాథ స్వామి వారి దేవస్థానం (గోదాగోకుల క్షేత్రం)లో అమ్మవార్లకు స్వామివారికి నిత్యకల్యాణోత్సవాలు ప్రారంభించామని క్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త అన్నారు. 'నిత్య కల్యాణం - పచ్చతోరణం' పేరుతో శ్రీదేవీ, భూదేవీ రంగనాథస్వామి వార్ల కల్యాణం ప్రతిరోజూ కొనసాగుతుందని ఆయన చెప్పారు. బుధ వారం గోకుల క్షేత్రంలో కల్యాణ వేడుకలకు సంబంధించిన బ్రోచర్లను గోకులం సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరంగనాథ స్వామి భక్తులపై కరుణతో పవిత్ర తుంగభద్రనదీ తీరాన, కాలుష్య రహిత వాతావరణంలో గోదా గోకులం వెలిశారని తెలిపారు. నిత్య కల్యాణ సేవల్లో పాల్గొనేవారు ఇటిక్యాల పుల్లయ్య, సెల్ నెం. 98853 41977లో సంప్రదించాలని కోరారు. ఆలయ వేద పండితులు రమేష్ భట్టాచార్య, కిరణ్ భట్టాచార్య మాట్లాడుతూ లోక కల్యాణార్థం, శ్రీపంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం గా నిత్యకల్యాణ సేవలతో దేశం, రాష్ట్రం, ఈప్రాంతం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఆరోగ్యం, కార్యక్రమంలో గోకులం సభ్యులు ఇటిక్యాల పుల్లయ్య, పాలాది సుబ్రహ్మణ్యం, వేముల జనార్ధన్, పెరుమాళ్ల బాలసుధాకర్ పాల్గొన్నారు.



బ్రోచర్లు విడుదల చేస్తున్న
గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజగుప్త, సభ్యులు

ఆడపిల్లలను చదివించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీవో నరసమ్మ

గూడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలందరినీ చదివించాలని ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీవో నరసమ్మ అన్నారు. బుధవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసం పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీవో నరసమ్మ మాట్లాడుతూ కిషోరీ వికాసం ఫేజ్-2 శిక్షణా కార్యక్రమంతో అందరికీ అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివనాగప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జరినాబాను, ఎంఈవో సునీలమ్మ, ఐసీపీఎస్ నరసింహులు, హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల మహిళా సమాఖ్య వెల్ఫేర్ సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ఓర్వకల్లు జనవరి 22, (ఆంధ్రజ్యోతి): మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని వయోజన విద్య అడిషినల్ విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఓర్వకల్లులోని మండల ఐక్య సంఘం శిక్షణా భవనంలో ఉల్లాస్ యోజన విద్య అక్షరాస్యతపై మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో హుశేనాపురం, కొమరోలు, సోమయాజులపల్లె, చెన్నంచెట్టి పల్లె, భైరాపురం, ఉప్పలపాడు, గుట్టపాడు తదితర గ్రామాల మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమం లో ఏపీఎం వెంకట్రామిరెడ్డి, వలంటీర్లు, టీచర్లు పాల్గొన్నారు.

పంచాయతీకి స్థలం కేటాయించాలి

ఓర్వకల్లు జనవరి 22, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంచర్లలో గ్రామ పంచాయతీకి పది శాతం స్థలాన్ని కేటాయించాలని సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ రమణయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ మండలంలో రోజురోజుకు పరిశ్రమలు వస్తున్న తరుణంలో వెంచర్లు అత్యధికంగా వేశారని, అయితే వెంచర్లలో పది శాతం స్థలాన్ని పంచాయతీకి కేటాయించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ తీర్మాణాలు లేకుండా వెంచర్లు విచ్చలవిడిగా వేసి విక్రయాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కోల్‌మాన్, మహేష్ పాల్గొన్నారు.

బలవర్ధక ఆహారం అందించాలి

కర్నూలు అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కుష్టు, టీబీ, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు బలవర్ధక ఆహారం అందించాలని పద్మావతి చారీ టబుల్ అండ్ వేల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం నగరం శివారులోని ఆశ్రమంలో వ్యాధిగ్రస్తులకు నువ్వుల ముద్దలు, గ్లూకోస్ డి, ఖర్జురాలు, పండ్లు, సబ్బులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ హరీష్, ట్రెజరర్ నివేష్, రాఘవేంద్ర, హుస్సేన్, హైమావతి పాల్గొన్నారు.

పొలంబడితో అధిక లాభాలు: ఏడీఏ

సి.బెళగల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పొలంబడితో అధిక లాభాలు ఆర్జించవచ్చునని వ్యవసాయ శాఖ ఏడీఏ సాలురెడ్డి అన్నారు. బుధవారం సి.బెళగల్‌లో రైతు వెంకటేశ్వర్లు అనే రైతు సాగు చేసిన మొక్కజొన్న పంటలో పొలంబడి ఏవో మల్లేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ ఈవోలు, రైతులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో విపత్తులపై అవగాహన



మాట్లాడుతున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు విపత్తు సమయంలో చేయాల్సిన ఫస్ట్ ఎయిడ్, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, బాషా, ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ జిల్లా డైరెక్టర్ అనుపమ, ఏడీఎఫ్‌వో చిన్నబజారులు మాట్లాడుతూ విప త్తు సమయంలో ఒక యోధుడిలా పోరాడాలన్నారు. సీఐ సాయికుమార్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు రమాజ్యోతి, సమన్వయకర్త సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రజక సొసైటీలకు ఇవ్వాలి



ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం ఇస్తున్న రజక సంఘం నాయకులు

కర్నూలు రూరల్ జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల్లో బట్టలు శుభ్రం చేసే టెండర్లు, దోబీపోస్టులు రజక సొసైటీలకు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రజక ఐక్య సేవా సమితి, రజక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన ఆర్టీసీ మేనేజింగ్ డెరెక్టర్ ద్వారకా తిరుమ లరావును కర్నూలు-1డిపో గ్యారేజీలో ఆ సంఘం నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఉద్యానవనాల నిర్వహణ మెరుగపడాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నగరంలో ఉద్యానవనాల నిర్వహణ మరింత మెరుగుపడాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. బుధవారం ఆయన నేతాజీ నగర్‌లో ఉద్యాన వనాన్ని, రాంబోట్ల దేవాలయం వద్ద బండ్ల రహదారి, వీకర్ సెక్షన్ కాలనీలో నూతనంగా నిర్మించిన మురుగు కాలువలను పరిశీలిం చారు. అనంతరం రాజ్‌విహార్, వినాయకఘాట్, ఐదు రహదారుల కూడలి ప్రాంతాల్లో పారిశుద్య పనులను ఆయన పరిశీలించారు. కమిషనర్ వెంట డీఈఈలు గిరిరాజు, క్రిష్ణలత, ఏఈ భానుప్రతాప్, ఉన్నారు.

సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా

కర్నూలు కల్చరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తల భవిషత్తుకు భరోసా ఉంటుందని టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి.హనుమంతరావు చౌదరి అన్నారు. బుధవారం కర్నూలు జిల్లా బాలకృష్ణ, మోక్షజ్ఞ సేవా సమితి అధ్యక్షుడు లతీఫ్, ఆయన కుటుంబ సభ్యులతోపాటు పలువురికి టీడీపీ సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మిపద్మా చౌదరి, సభ్యుడు ఈశ్వరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా..

- పత్తికొండ వీకే నగర్ కాలనీ దుస్థితి
- రోడ్లు, డ్రైనేజీలు లేవు, నిత్యం దుర్వాసన..



సీసీ రోడ్డు, డ్రైనేజీ లేక.. రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగు

పత్తికొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీకే ఆదినారాయణ రెడ్డి జ్ఞాపకార్థం ఇళ్ల స్థలాలు ఇచ్చారు. భూమి లేని నిరుపేదల కోసం సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో ఈ కాలనీ ఏర్పడింది. దాదాపు వంద కుటుంబాలు నివాసముం డగా, 400 మందికి పైగా నివసిస్తున్నారు. ఇందులో మంది 250 ఓటర్లు ఉన్నారు. రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్లను కూడా జారీ చేశారు.

కనీస వసతులు కరువు

కాలనీలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు అవస్థ పడుతున్నారు. రోడ్లు, డ్రైనేజీ కూడా లేదు. దీంతో వర్షాకాలంలో వర్షపు నీటితో సహవాసం చేయాల్సి వస్తోంది. కాలువ లేకపోవడంతో మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. తాము ఇంటి పన్ను, కరెంటు బిల్లులు కడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి, అభివృద్ధి పనులు చేయించాలని కోరుతున్నారు.

అభివృద్ధికి నోచుకోక..

ఈ కాలనీ 2007లో ఏర్పడింది. రెవెన్యూ డివిజన్ కేంద్రంలోనే ఇలా ఉందని వాపోతున్నారు. అప్పట్లో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఈ స్థలం తనదని కోర్టును ఆశ్రయించగా ఆ కేసును కోర్టు కొట్టేసింది. దీంతో ఇక్కడ గుడిసెలు వేసుకున్న పేదలకే ఈ స్థలం సమకూరింది. కాలనీ ఏర్పడి 18 ఏళ్లు కావస్తున్నా నేటికీ అభివృద్ధికి నోచుకోలేదు. నాయకులు కాలనీ వైపు కన్నెత్తి చూడడం లేదనకి కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీలు ఇచ్చి వెళుతున్నారు



మా కాలనీకి ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు వచ్చి హామీలు ఇచ్చి వెళుతున్నారు. రోడ్లు, డ్రైనేజీ వేయిస్తామని ఓటు వేయాలని కోరుతున్నారు. గాలిచాక కాలనీ వైపు కన్నెత్తి చూడడం లేదు. **- సుశీలమ్మ**

పన్నులు చెల్లిస్తున్నాం



మేమంతా పేదవాళ్లమే, ఇంటి ,కొళాయి పన్నులు చెల్లిస్తున్నాం. కాలనీలోనే రోడ్లు, కాలువను నిర్మించాలని అధికారులుకు పలుమార్లు విన్నవించాం. కూటమి నాయకులు మా కష్టాలు తీరుస్తారని ఆశిస్తున్నాం. **- శ్రీనివాసులు**

రీ సర్వేకు సహకరించాలి

మద్దికెర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామ రైతులు రీ సర్వేకు సహకరించాలని తహసీల్దార్ మహ్మద్ హుశేన్ విజ్ఞప్తి చేశారు. బుధవారం గ్రామంలో రీ సర్వేను తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందుగా సమాచారం ఇచ్చి రీసర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రోజుకు 20 ఎకరాలు మాత్రమే సర్వే చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వీఆర్వోలు బాలవర్దన్, మల్లికార్జున ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కృష్ణ

ఆదోని టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ కృష్ణ బుధవారం తెల్లవారుజామున తనిఖీ చేశారు. చెత్త తొలగింపు, వీధులను శుభ్రం పనులు పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

ఆదోని రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ మండలానికి బీసీ కార్పొరేషన్ కింద 60 యూనిట్లకుగాను రూ.16 కోట్లు మంజూరయ్యా యన్నారు. నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందాలని, ఒక్కొక్కరికి రూ.1.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణం ఇస్తామని, 50 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండగా, మిగతా 50 శాతం బ్యాంకు రుణం వస్తుందన్నారు. ఏపీవోబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దేవరలో ఎమ్మెల్యే విరుపాక్షి

హలహర్వి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మేదాహల్‌లో నిర్వహించిన దేవరలో నాయకులు సందడి చేశారు. బుధవారం గ్రామంలో ఉత్సవం ఘనంగా నిర్వహించారు. టీడీపీ, వైసీపీ నాయకులు దర్శనం చేసుకున్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విరుపాక్షి పాల్గొన్నారు.



దేవరలో పాల్గొన్న ఎమ్మెల్యే విరుపాక్షి



చెరువు రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

చెరువును అక్రమిస్తే కేసులు: ఆర్డీవో

ఆలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చెరువును ఆక్రమించే వారిపై కేసులు నమోదు చేస్తామని పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ హెచ్చరించారు. బుధవారం ఆలూరు చెరువును పరిశీలించారు. చెరువు సరిహద్దును తహసీల్దార్ గోవింద్ సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. డీటీ విజయ్ కుమార్, వీఆర్వో మహేంద్ర, సర్వేయర్ అరుణజ్యోతి పాల్గొన్నారు.

ఉల్లాస్ నిరక్షరాస్యులకు వరం

దేవనకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ నిరక్షరాస్యులకు వరమని వెలుగు ఏపీఎం నరసన్న, వయోజన విద్య సూపర్‌వైజర్ ఫయాజ్ అన్నారు. బుధవారం మూడోరోజు స్త్రీ శక్తి భవనంలో వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సూచించారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు

జయప్రదం చేయండి

ఆలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలని టీడీపీ యువ నాయకుడు గిరి మల్లేష్ గౌడ్ బుధవారం కోరారు. పార్టీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ ఆదేశాల మేరకు గురువారం ఆలూరులో బైక్ ర్యాలీ, కార్యాలయంలో కేక్ కటింగ్ ఉంటాయన్నారు.

మృతి బాధాకరం

పత్తికొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రోడ్డు ప్రమాదంలో మంత్రాలయం వేదపాఠశాల విద్యార్థులు మృతి బాధాకరమని బ్రాహ్మణ సంఘం నాయకులు అన్నారు. నాయకులు ఏవీఎస్ విశ్వం, ఎంకే నాగరాజు, విజయ్‌స్వామి, అన్నం వెంకటరమణ, రాఘవేంద్రరావు, నివర్తి భాస్కర్ మౌనం పాటించారు.

వేగవంతం చేయండి

మద్దికెర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధులతో చేస్తున్న సీసీ రోడ్డు పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఏఈ విష్ణువర్ధన్ సూచించారు. బుధవారం స్థానిక మోమిన్ వీధిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మాజీ కోఆప్షన్ సత్తార్ ఉన్నారు.

అధికారుల గైర్హాజరుపై కలెక్టర్‌కు నివేదిక

హలహర్వి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశానికి అధికారుల గైర్హాజరుపై ఎంపీడీవో వరలక్ష్మి కలెక్టర్‌కు నివేదిక పంపారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'సభ్యులు లేని సమావేశం' కథనంపై కలెక్టర్ ఆరా తీసినట్లు సమాచారం. గైర్హాజరైన వారి వివరాలు శాఖల వారీగా నివేదిక పంపారు. వారం ముందు సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

పత్తికొండ వాసికి డాక్టరేట్

పత్తికొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండగేరికి చెందిన ఎం.రాజేష్‌కు ఎస్వీ యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈమేరకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం.దామ్లు నాయక్ ప్రకటించారు. సోషల్ యాస్పెక్ట్స్ ఆఫ్ టెలి మెడిసిన్-ఏ స్టడీ ఇన్ చిత్తూర్ ఆఫ్ ఏపీ పరిశోధనను రాజేష్ సమర్పించారు. సోషియాలాజీ ప్రొఫెసర్ జి.స్టాన్లీ జయకుమార్ గైడ్‌గా వ్యవహరించారు.

పశు సంపదతో గ్రామీణాభివృద్ధి

మద్దికెర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పశుసంపదతో గ్రామీణాభివృద్ధి సాధ్యమని మాజీ జడ్పీటీసీ సభ్యుడు పి.పురుషోత్తం చౌదరి అన్నారు. బుధవారం పెరవలి గ్రామంలో ఉచిత వైద్యశిబిరాల పోస్టర్లను ఆవిష్కరించారు. నేడు హంపా గ్రామంలో పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని పశువైద్యుడు కృష్ణానాయక్ తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నెరవేరిన కల

- సీసీ రోడ్డు నిర్మాణంతో హుశేనాపురం గ్రామస్థుల హర్షం



నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామస్థుల కల నెరవేరింది. నూతన సీసీ రోడ్డును ఎమ్మెల్యే శ్యాంబాబు గురువారం ప్రారంభించారు. గుంతల్లో పడుతూ లేస్తూ మట్టి రోడ్డులోనే రాకపోకలు సాగించారు. 50 ఏళ్ల నుంచి అవస్థలు పడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే శ్యాంబాబు రూ.92 లక్షల నిధులు మంజూరు చేసి, సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మించారు. దీంతో గ్రామస్థుల ఆనందానికి అవధులు లేవు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, తిమ్మయ్య చౌదరి, వెంకటపతి, తిరుపాల్ నాయుడు, సుల్తాన్, ఫక్కీరప్ప, డీఈ శేషయ్య, ఏఈ వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, కొమ్మె వెంకటేశ్, రాజు నాయక్, తులసి నాయక్, ఏక్‌నాథ్, సంఘాల కృష్ణ పాల్గొన్నారు.

ఆలయ స్థలంపై విచారణ



స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర వర్మ

వెల్దుర్తి టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 1వ వార్డు ఆలయ స్థలంపై తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ బుధవారం విచారణ చేశారు. ఆలయ స్థలాలను ఆక్రమించారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. స్థానికులు దాత బొమ్మన దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయాన్ని పునర్‌నిర్మిస్తున్నామని ఇసుక, సిమెంటు సరఫరాకు రామళ్లకోట రోడ్డు, స్థలానికి మధ్య ఉన్న కల్వర్టుపై రహదారిని మాత్రమే ఏర్పరచారనీ, అక్రమ నిర్మాణాలు చేయడం లేదని స్థానికులు వివరించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. సర్వేయర్ హేమంత్ రెడ్డి, వీఆర్వోలు ప్రతాప్, పద్మ ఉన్నారు.

ఎల్‌టీపీలకు ప్రాధాన్యం ఇవ్వాలి



డీఎల్పీవోకు వినతిపత్రం ఇస్తున్న ఎల్‌టీపీలు

ఆదోని రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎల్‌టీపీలకు ప్రాధాన్యమివ్వాలని అసోసియేషన్ అధ్యక్షుడు రంగ స్వామి కోరారు. బుధవారం డీఎల్‌పీవో నూర్జహాన్, మండిగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శి చ్రందశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణాల మంజూరు ప్లాన్లు వేసి ఆన్‌లైన్‌లో అప్రూవల్ చేసే పనులను స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రంగస్వామి, చంద్రశేఖర్, విజేంద్రనాథ్ ప్రసాద్, జితేంద్రనాథ్ తివారి, ఈరన్న, రఫీక్, రవి, సాబీర్ పాల్గొన్నారు.

చెరువును ఆక్రమిస్తే ఉపేక్షించం



చెరువును పరిశీలిస్తున్న జనసేన ఇన్‌చార్జి వెంకప్ప

ఆలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చెరువును ఆక్రమిస్తే ఏ పార్టీ వారినైనా ఉపేక్షించమని ఆలూరు జనసేన ఇన్‌చార్జి వెంకప్ప హెచ్చరించారు. బుధవారం ఆయన చెరువును పరిశీలించారు. అనంతరం మాట్లాడు తూ 155 ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువును గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నాయకులు ఆక్రమించుకుంటే జనసేన తరపున అడ్డుకున్నామన్నారు. తాజాగా కొందరు ప్లాట్లు వేసేందుకు రాళ్లు పాతారని, వారి వెనుక ఎవరు ఉన్నా వదిలిపెట్టమన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మించి ప్రజల దాహార్తిని తీరుస్తామన్నారు. చెరువు ఆక్రమణపై కలెక్టర్, రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులను కోరినట్లు తెలిపారు. ఆర్‌డీవోకు ఫిర్యాదు చేయగా ఆయన చెరువును పరిశీలించారన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే శ్యాంబాబు సూచించారు. బుధవారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. బాలికా విద్యపై తల్లిదండ్రుల్లో మార్పు వచ్చిందన్నారు. టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, తిమ్మయ్యచౌదరి, హోటల్ శ్రీనివాసులు, బత్తినిలోక్‌నాథ్, సింగంశ్రీనివాసులు, మీరాహుసేన్, హెచ్‌ఎం భ్రమరాంబ, ఉపాధ్యాయులు సత్యనారాయణ పాల్గొన్నారు.

చెత్తతో సంపద కేంద్రాల తనిఖీ

వెల్దుర్తి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాలను నిరుపయోగంగా ఉంచవద్దని ఈవోఆర్డీ రవికిశోర్ సూచించారు. బుధవారం మండలంలోని పుల్లగుమ్మి గ్రామంలో చెత్తసంపద తయారీ కేంద్రం, సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగులు సర్వేలను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యదర్శి రహమత్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్డీ

ఆక్రమణల తొలగింపు

పత్తికొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారి ఆక్రమణలను అధికారులు తొలిగిస్తున్నారు. డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నామని పట్టణవాసులు ఎమ్మెల్యే శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచనల మేరకు అంబేడ్కర్ సర్కిల్‌లోని రాఘవరెడ్డి కాంప్లెక్స్ నుంచి ఆదోని రోడ్డులోని చర్చి వరకు రూ.11లక్షలతో కాలువల నిర్మాణానికి పంచాయతీ అధికారులు పనులు ప్రారంభించారు. ఈవో నరసింహులును వివరణ కోరగా కాలువలు దాటి నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

ఇంటి పన్నులు చెల్లించండి

మద్దికెర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇంటి పన్నులు చెల్లించి చెత్తబుట్టలు తీసుకెళ్లాలని ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి కోరారు. బుధవారం గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది గ్రామంలో పర్యటించి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. వేసవి సమీపిస్తున్నందున తాగునీటి పథకాలను బాగు చేయించాలన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఉన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

దేవనకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు మద్దిలేటిశెట్టి అన్నారు. బుధవారం ఎంఈవో తిమ్మారెడ్డి అధ్వర్యంలో నూతన కాలెండర్లని ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విద్యార్థికి రూ.15వేలు జమచేయాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పు బకాయిలు రూ.3580 కోట్లు ఉండగా రూ.788 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. కార్యదర్శి భాస్కర్, సురేంద్ర పాల్గొన్నారు.

దేవరలో నాయకుల సందడి



దేవరలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పగిడిరాయి గ్రామంలో దేవరలో బుధవారం నాయకులు సందడి చేశారు. ఎమ్మెల్యేలు శ్యాంబాబు, పార్థసారథి టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర పాల్గొన్నారు. నాయకులు పాటిల్ ఈశ్వర్ రెడ్డి, నక్కల రమేష్, టీచర్ రామాంజనేయులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్‌గౌడ్ గృహాలకు వెళ్లారు.

స్వచ్ఛత ఎక్కడ సారూ?



ఆదోని మార్కెట్ యార్డు రహదారి పక్కన చెత్త

ఆదోని అగ్రికల్చర్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): ఓ పక్కన స్వచ్ఛాంధ్రప్రదేశ్ అంటూ హంగామా చేస్తుంటే మరో పక్క పట్టణంలో చెత్తాచెదారం కనిపిస్తోంది. పట్టణంలోని మార్కెట్ యార్డ్ రహదారి పక్కన చెత్త తాండవిస్తోంది. చుట్టుపక్కల పరిశ్రమల నుంచి వచ్చే చెత్తను ఇక్కడ వేస్తుండడంతో దుర్గంధం వస్తోంది. నడవడానికి పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పారిశుధ్య పనులు చేయించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

సజ్జలగుడ్డం అంతా ఖాళీ

● పనులు లేక వంద కుటుంబాలు వలస



గుంటూరుకు వలస వెళ్తున్న గ్రామస్థులు

కోసిగి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జల గుడ్డం గ్రామంలో మూడు నెలల నుంచి ఉపాధి హామీ పనులు ప్రారంభించలేదు. స్థానికంగా గ్రామంలో పనుల్లేక పోవడంతో ప్రజలు వేరే ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకునేవారు. అక్కడ కూడా పనులు ముగియడంతో గ్రామంలో ఉపాధి పనులు అధికారులు ప్రారంభించక పోవడంతో బుధవారం గ్రామంలోని సుమారు వంద కుటుంబాలు ఐదు వాహనాల్లో మూటముళ్లే సర్దుకుని వలసబాట పట్టారు. గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అధికారులు గ్రామంలో ఉపాధి పనులు నేటికి కూడా ప్రారంభించలేదని, అందుకే వలస వెళ్తున్నామని తెలిపారు. గ్రామానికి చెందిన 70 ఎస్సీ కుటుంబాలు ఇళ్లకు తాళాలు వేసి గుంటూరుకు పయనమయ్యారు. గ్రామం అంతా బుధవారం రాత్రి ఇళ్లకు తాళాలు వేసి ఉపాధి కోసం ఊరు వదిలారు.

రీ సర్వేతో రైతులందరికీ న్యాయం



నదికైరవాడిలో రీసర్వే రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నందవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో రైతులందరికీ న్యాయం జరుగుతుందని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. బుధవారం నందవరంలోని నదికైరవాడి గ్రామంలో రీ సర్వేకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివాదంలో ఉన్న భూములను పరిశీలించారు. రీ సర్వేతో రైతులందరికీ న్యాయం చేస్తామన్నారు. రైతులు కూడా అధికారులకు సహకరించాలన్నారు. అనంతరంరం రీ సర్వే రికార్డులను పరిశీలించారు. గ్రామ సచివాలయంలోలో అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, డీటీ మహేష్, ఆర్ఐ సుబ్బారెడ్డి, సర్వేయర్లు శ్రీనివాసులు, అక్బర్‌బాష, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు కురవ వీరేష్, డీలర్‌బజారి, వీరారెడ్డి, సర్వేయర్లు మల్లికార్జునగౌడు, మాధవి, అశ్విని, సోనియా సుల్తాన్, వీఆర్వోలు రాఘవేంద్ర, చిన్న కొండన్న, రంగస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

మంత్రాలయం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వేదపాఠశాల విద్యార్థుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మంత్రాలయంలో వేద విద్యార్థి విజయేంద్ర, డ్రైవర్ కంసలి శివ ఇళ్లకు వెళ్లి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. విద్యార్థులకు రావాల్సిన పరిహారం ప్రభుత్వం నుంచి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు వరదరాజులు, అశోకరెడ్డి, తిమ్మప్ప, నరసింహులు, రఘు, బీమరెడ్డి, మేకల వెంకటేష్, ఎంపీటీసీ మేకల నరసింహులు పాల్గొన్నా రు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కోసిగి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్-2025 నూతన క్యాలెండర్‌ను బుధవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ ఆధ్వర్యంలో కోసిగి ఎస్ఐ చంద్రమోహన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్షరాస్యతలో వెనుకబడిన కోసిగి మండలంలో విద్యార్థుల అభివృద్ధి హక్కుల కోసం అనునిత్యం ఏఐఎస్ఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అంజి, విజయ్, భాస్కర్, బడేసాబ్, దివాకర్ తదితరులున్నారు.

మంగళగిరికి బయలుదేరిన చేనేత కార్మికులు

ఎమ్మిగనూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు వృత్తిల్లో నైపుణ్యం పెంచుకునేందుకు మంగళగిరిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణకు ఎంపికైన 25మంది చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్స్ బుధవారం ఎమ్మిగనూరు నుంచి పలు వాహనాల్లో మంగళగిరికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సహకారంతో ఎమ్మిగనూరు ప్రాంతాన్ని చేనేత వస్త్రాల ఉత్పత్తి సామర్థ్యంగా ఉన్న ప్రాంతంగా చెన్నైకు చెందిన హ్యాండ్‌లూమ్స్ ఎక్స్‌పోర్టు కౌన్సిల్ గుర్తించిందన్నారు. దీంతోనే మంగళగిరిలో చేనేత కార్మికులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులకు వృత్తి నైపుణ్యం పెంచుకునేందుకు సహకారం అందించిన ఎమ్మెల్యే, చేనేత జౌళి శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రాలయం ఎస్ఐపై వేటు

నూతన ఎస్ఐగా శివాంజులు

మంత్రాలయం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఎస్ఐ పరమేష్‌నాయక్‌పై జిల్లా అధికారులు వేటు వేశారు. బుధవారం ఆయన స్థానంలో నంద్యాలలో పని చేస్తున్న శివాంజులు బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన పరమేష్ నాయక్‌పై పలు ఆరోపణలు రావడంతో కర్నూలు వీఆర్‌కు పంపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శివాంజులు మాట్లాడుతూ మంత్రాలయం పవిత్రతను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. ఇసుక, మద్యం చేసే వారిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రెవెన్యూ పంచాయతీ, శ్రీమఠం అధికారులతో కలసి ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తామని అన్నారు.

భవిష్యత్తు సుగ్గిపాలు

● తల్లిదండ్రుల వెంట వలసపోతున్న విద్యార్థులు
● తగ్గిపోతున్న హాజరు శాతం

కోసిగి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులతో పాటు బడుల్లో చదువుకునే విద్యార్థులు సైతం వలసబాట పట్టడంతో మండలంలో అక్షరాస్యత మరింత తగ్గిపోయే ప్రమాదం కనిపిస్తుంది. సంక్రాంతి సెలవుల అనంతరం బడులు ప్రారంభం కావడంతో ఆయా పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం తగ్గిపోయింది. మండలంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 48 ఉండగా.. 14,208 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే.. బుధవారం 10,714 మంది హాజరయ్యారు. 3,494 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గత వారం రోజుల నుంచి కోసిగితో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సుమారు 10వేల కుటుంబాలకు పైగా కర్ణాటక, తెలంగాణతో పాటు గుంటూరు, తిరుపతి, విజయవాడ వంటి ప్రాంతాలకు పిల్లాపాపలతో కలిసి ప్రజలు వలసెళ్లిపోయారు. కోసిగిలోని హిందూ గర్ల్స్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 వ తరగతి 451 మంది విద్యార్థులకు గాను బుధవారం 196 మంది విద్యార్థులు హాజరయ్యారు కావడంతో 44 శాతం నమోదైందని ఇన్‌చార్జి హెచ్‌ఎం కే.అరుణ తెలిపారు. మండలానికి రెగ్యులర్ మండల విద్యాధికారి లేకపోవడంతో ఉన్న ఇద్దరు మండల విద్యాధికారులు కార్యాలయాల్లోనే కుర్చీలకే పరిమితమయ్యారు. దీంతో వలసలు వెళ్తున్న పిల్లలను, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇక్కడే ఏర్పాటు చేయడంలో విద్యాశాఖ అధికారులు తీవ్రంగా విఫలమైంది. సీజనల్ హాస్టల్స్ కొన్ని బడుల్లో ఏర్పాటు చేసినా అవి కూడా నామమాత్రంగా ఉండటంతో ఎవరూ కూడా ఉంటున్న దాఖలాలు కనపడటం లేదు. మండలంలో విద్యార్థుల వలసలను ఆపి ప్రభుత్వ బడుల్లో చదివేందుకు కృషి చేయాలని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

వలసలను నివారించడంలో అధికారులు విఫలం



మండలంలో వలసలను నివారించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. తల్లిదండ్రులతో పాటు బడి పిల్లలు కూడా వలసబాట పట్టడంతో ప్రభుత్వ బడులలో 50 శాతానికి పైగా హాజరు శాతం తగ్గింది. జిల్లా అధికారులు ప్రభుత్వ బడులలో సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేయాలి.

- వీరేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు



కోసిగి హెచ్‌జీ ప్రాథమిక పాఠశాలకు హాజరైన విద్యార్థులు

తరగతి గదులను చూస్తే బాధ కలుగుతోంది



విద్యార్థులు తల్లిదండ్రుల వెంటే వలస వెళ్లిపోతుండటంతో విద్యార్థులు లేక బోసిపోయిన తరగతి గదులను చూడటం బాధగా ఉంది. ఒకప్పుడు తరగతి గదులు కళకళలాడుతూ ఉండేవి.

- కే అరుణ, హెచ్‌జీ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం

మా అమ్మ, నాన్న వెంటే వెళ్తున్నా



మా అమ్మ, నాన్న వెంట నన్ను కూడా గుంటూరుకు తీసుకెళ్తున్నారు. నాకు చదువుకోవాలని ఉంది. మా అమ్మనాన్నలు వెళితే నా బాగోగులు చూసుకునేవారు లేరు. అందుకే నేనూ వెళ్తున్నాను.

- తిప్పలదొడ్డి శివ, 3వ తరగతి విద్యార్థి, కోసిగి

వలసలతో విద్యార్థుల జీవితాలు అంధకారం

తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న విద్యాశాఖ అధికారులు

గోనెగండ్ల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ముగియడంతో జిల్లా పశ్చిమ ప్రాంతం నుంచి వలసలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రతి గ్రామం నుంచి వంద సంఖ్యలో కూలీలు వలసలు వెలుతున్నారు. కలెక్టర్ అధికారుల ఆదేశాల మేరకు బుధవారం గోనెగండ్ల మండల పరిధిలోని గోనెగండ్ల, గంజహళ్లి, నెరుడుప్పల, పెద్దమరివీడు, ఐరన్‌బండ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో మండల విద్యాశాఖ అధికారులు పర్యటించి వలసలు వెళ్లే కూలీల ఇండ్లకు వెళ్లి వలస వల్ల కలిగే ఇబ్బందులు చెప్పడంతో పాటు ఇక్కడే పనులు కల్పిస్తారని వారికి భరోసా ఇస్తున్నారు. అలాగు తమ పిల్లలను వలసలకు తీసుకువెళ్లవద్దని మరీ ఇంటింటికి వెళ్లి కోరుతున్నారు.

మాపిల్లను వెంట తీసుకెళ్తున్నాం: గోనెగండ్ల మీదుగా బుధవారం కోసిగి మండలం పల్లెపాడుకు చెందిన కూలీలు వలస బండిలో వెళ్తున్నారు. దీన్ని గమనించిన గోనెగండ్ల మండల ఎంఈవో నీలకంఠ వలస బండిని ఆపి వివరాలు సేకరించారు. చదువుకునే పిల్లను ఎందుకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించారు. మీ పిల్లను మాతో పంపండి సీజనల్ హాస్టల్‌లో చేర్చుతామని చెప్పాడు. దీంతో కూలీలు ససేమిరా అన్నారు. మా పిల్లలను మాతోనే తీసుకెళ్తామని చెప్పి గుంటూరుకు వెళ్లిపోయారు.

ఎమ్మిగనూరు రూరల్: తల్లిదండ్రులు విద్యార్థులను తమ వెంట వలసకు తీసుకువెళ్లడం వలన వారి భవిష్యత్ అంధకారం అవుతుందని మాస్మాన్ దొడ్డి ప్రధానోపాధ్యాయుడు శాంతిరాజు అన్నారు. బుధవారం గ్రామంలో కలియ తిరిగి విద్యార్థుల తలిదండ్రులను వలసలకు తీసుకువెళ్లకుండా చైతన్య పరిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునిస్వామి, అపర్ణలత పాల్గొన్నారు.



గోనెగండ్ల మీదుగా వలస వెళ్తున్న బండిని ఆపి అవగాహన కల్పిస్తున్న ఎంఈవో నీలకంఠ

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి: ఐఎఫ్‌టీయూ

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే నర్సన్న డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఏపీ ఎన్జీవో కార్యాలయం ఆవరణలో కార్మిక, కర్షక, కార్యకర్తల సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కే అనిఫ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే నర్సన్న, భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి ఏసేపు మాట్లాడుతూ వారానికి 90గంటలు పని చేయాలని ఎల్అండ్‌టీ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకించాలన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు మౌనం వహించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మికుల కర్షకులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం అమరావతి, పోలవరం పేరు చెప్పి కాలయాపన చేస్తున్నారని అన్నారు. రాయలసీమ నుంచి ఎందరు ముఖ్యమంత్రులు అయినా సీమ ప్రజల తలరాతలు మార్చడం లేదన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు నిర్మించక పోవడం వలన నిత్యం కరువు కాటకాలతో నీటి కొరతతో రైతులు పండించిన పంటకు గిట్టుబాట ధర లేక రైతు కూలీల వలస పోతున్నారన్నారు. కార్మిక కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో లక్ష్మన్న, శంకర్, జయన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేస్తాం

మంత్రాలయం జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యలో నష్టపోకుండా ఉండేందుకు వలసలు వెళ్లిన తల్లిదండ్రుల పిల్లలను గుర్తించి సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేస్తామని ఎంఈవోలు షైనుద్దీన్, రాగన్న తెలిపారు. బుధవారం మండలంలోని మాధవరం, సూగూరు గ్రామాల్లో హెచ్‌ఎం లచ్చప్ప, రామ్మోహన్ ఆధ్వర్యంలో వలసలు వెళ్లిన ఇళ్లను పరిశీలించి వారి పిల్లలకు సీజనల్ హాస్టల్స్‌లో చేర్పించి విద్యను అంది స్తామని తెలిపారు. వలసలు వెళ్లిన తల్లిదండ్రులు తమ పిల్లలను సీజనల్ హాస్టల్స్‌లో కొనసాగించేటట్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు నరసన్నగౌడు, బంగారప్ప, భీమేష్ పాల్గొన్నారు.

వలస వెళ్లవద్దు

పెద్దకడుబూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోనే పనులు కల్పిస్తామని, వలసలు వెళ్లవద్దని.. మీతో పాటు మీ పిల్లలను తీసుకెళ్లవద్దని ఎంపీడీవో జయరాముడు కోరారు. బుధవారం మండలంలోని దొడ్డిమేకల, పెద్దకడబూరు గ్రామాల నుంచి పలువురు వ్యవసాయ కూలీలు మూటముళ్లే సర్దుకొని వలస వెళ్లారు. ఈ క్రమంలో పెద్దకడబూరులోని ఎంపీడీవో కార్యాలయం ముందు నుంచి బొలెరో వాహనంలో వలస కూలీలు వెళ్తుండగా గమనించిన ఎంపీడీవో వాహనాన్ని నిలిపి కూలీలతో మాట్లాడారు. మీ గ్రామాల్లోనే పనులు కల్పిస్తామని చెప్పారు. పిల్లలను మీ వెంట తీసుకెళ్లి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేయవద్దని కోరారు. ఇందుకు వలస కూలీలు మా ఇబ్బందులు మాకున్నాయని, మా పిల్లలను ఇక్కడ వదిలితే ఎవరు చూసుకుంటాని ప్రశ్నిస్తూ వలస బండిని ముందుకు కదిలించారు.

క్రీడలు, ఎద్దుల పోటీలు విజయవంతం



మాట్లాడుతున్న ఈరన్న గౌడ్

ఎమ్మిగనూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నీలకంఠేశ్వర జాతర సందర్భంగా మాజీ మంత్రి దివంగత బీవీ మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన క్రీడాపోటీలు, ఎద్దుల బండలాగుడు పోటీలు పట్టణ, నియోజకవర్గ ప్రజల సహకారంతో విజయవంతం అయ్యాయని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముగతి ఈరన్న గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక కుర్నీ కమ్యూనిటీ హాల్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు భాస్కర్ ,మహేంద్రబాబు, రామకృష్ణ నాయుడు, నవాజ్‌తో కలిసి ఈరన్న గౌడ్ మాట్లాడారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీలతో పాటు రైతు సంబరాల పేరుతో ఎద్దుల బండలాగుడు పోటీలు దాదాపు పక్షం రోజులు ప్రజలను ఎంతగానో అలరించాయన్నారు. పోటీలు నిర్వహించేందుకు, విజయవంతం అయ్యేందుకు సహకరించిన ఎమ్మెల్యే బీవీ, పట్టణ వ్యాపారులు, అధికారు, అనాధికారులు, క్రీడాభి మానులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఇదే సహకారం రాబోయే రోజుల్లో అందించాలని కోరారు. సమావేశంలో ఎమ్మిగనూరు పట్టణం, మండలం,నందవరం, గోనెగండ్ల మండలాల టీడీపి నాయకులు పాల్గొన్నారు.

గడ్డి వాము దగ్ధం.. రూ. 2 లక్షల ఆస్తి నష్టం

మంత్రాలయం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. బాధితుడు బోయ భీముడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివార్లలో మూగజీవాల కోసం పశుగ్రాసం నిల్వ ఉంచాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఎమ్మిగనూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు వ్యాప్తి చెందకుండా ఆర్పివేశారు. గడ్డివాము దగ్ధం కావడంతో దాదాపు రూ. రెండు లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం పరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రాంతీయ పార్టీగా జనసేనకు గుర్తింపు

పెద్దకడుబూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ పార్టీగా జనసేనను కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించడంపై జనసేన మండల ఇన్‌చార్జి గణేష్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జనసేనను ప్రాంతీయ పార్టీగా గుర్తించి పార్టీ గుర్తు గాజు గ్లాసును శాశ్వత కేటాయించడం శుభపరిణామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘానికి జనసైనికులు తరుపున ధన్యావాదాలు తెలుపుతున్నామన్నారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సమాజంలో మార్పుకోసం అవినీతి నిర్మూలను, డబ్బులేని రాజకీయం చేయాలని సంకల్పంతో అలుపెరగని పోరాటాలు చేస్తున్నారని అన్నారు.

ఉపాధి పనులు చేపట్టాలి

మంత్రాలయం జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశ్చిమ ప్రాంతమైన మంత్రాలయం నియోజకవర్గంలో వలసల నివారణ కోసం ఉపాధి పనులు వేగవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిక్కన్న డిమాండ్ చేశారు. బుధవారం మంత్రాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో పనులు లేక గ్రామాలన్ని ఖాళీ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ కూలీలకు భరోసా ఇవ్వడం లేదని, తూ తూ మంత్రంగా పనులు కల్పిస్తున్నారని ఆరోపించారు. రోజుకు రూ.600లు కూలీ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మృతి చెందిన వారికి రూ.ఐదులక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సం ఘం మండల కార్యదర్శి ప్రాణేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, లక్ష్మన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఐపీవైఎల్ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖబరస్థాన్, కలుగొట్ల రోడ్డు, బాబు జగ్జీవన్‌రామ్ కాలనీల్లో కనీస వసతులు కల్పించాలని స్థానికులు కోరారు. బుధవారం కమిషనర్ గంగి రెడ్డికి ఐపీవైఎస్ జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖబరస్థాన్, కలుగొట్ల రోడ్డు, బాబు జగ్జీవన్‌రామ్ కాలనీల్లో సీసీ రోడ్లు వేయాలని గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు వినతి పత్రాలు ఇచ్చిన ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి మా కాలనీల్లో సీసీ రోడ్లు, తేలు షాపు సర్కిల్‌లో లైటింగ్ వేయించాలని కోరారు. కార్యక్రమంలో పీడీ ఎస్ విజయ్, ఎల్లప్ప, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కొత్త రోడ్లకు ప్రతిపాదనలు

● ఆర్అండ్‌బీ డీఈ నాగరాజు



ఎమ్మిగనూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఆర్అండ్‌బీ సబ్‌డివిజన్ పరిధిలో దాదాపు రూ. 110కోట్లతో సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆర్అండ్‌బీ డీఈ నాగరాజు తెలిపారు. అలాగే డివిజన్ పరిధిలో 218కిమీ మేర గుంతలు పడ్డ రోడ్లులో ప్యాచీలు వేసే పనులు పూర్తి కావచ్చాయన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: ఎమ్మిగనూరు ఆర్అండ్‌బీ సబ్ డివిజన్ పరిధిలో ఎన్ని కిమీ మేర ప్యాచీవర్క్‌లు గుర్తించారు.. ఎన్ని నిధులు మంజూరయ్యాయి?

జవాబు: ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ పరిధిలో 218 కిమీలో 41 పనులను గుర్తించాము. రూ. 2.75 కోట్లతో పనులు చేపట్టాం. ప్యాచిపనుల్లో ఇప్పటి వరకు 38 పూర్తి చేశాం. ఈనెల చివరికి మిగతావి పూర్తి చేస్తాం.

ప్రశ్న: ప్యాచి పనుల్లో నాణ్యతప్రమాణాలు ప్రటిస్తున్నారా?

జవాబు: ప్యాచిపనులు నాణ్యత ప్రమాణాల ప్రకారమే జరిగాయి. మా సిబ్బంది దగ్గర ఉండి వేయిస్తున్నారు. అలాగే మేము పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నాం.

పశ్న: ఎమ్మిగనూరు, కంబళదిన్నె రోడ్డు, పెద్దకడుబూరు, బైచిగేరి రోడ్డు పనులు ఎప్పుడు చేపడతారు?

జవాబు: ఎమ్మిగనూరు, కంబాళదిన్నె రోడ్డు 12 కి.మీ రూ.22 కోట్లతోను, పెద్దకడుబూరు, బైచిగేరి 13 కి.మీ రోడ్డుకు ఇదివరకే టెండర్లు పూర్తి అయ్యాయి. అగ్రిమెంట్లు కూడా అయ్యాయి. ప్రభుత్వం కొత్త రేట్లు అనుమతి ఇస్తే త్వరలో డబుల్ రోడ్డు పనులు ప్రారంభిస్తాము.

ప్రశ్న: డివిజన్ పరిధిలో కొత్త రోడ్లు ఏర్పాటుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: డివిజన్ పరిధిలో ఎమ్మిగనూరు నుంచి బిల్లేకల్ రోడ్డు, నందవరం మండలం ముగతి నుంచి నాగలదిన్నె, తిమ్మనదొడ్డి నుంచి నాగలదిన్నె, కోసిగి నుంచి ఉరుకుంద వరకు ప్రస్తుతం ఉన్న రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చేందుకు 56 కిమీ మేర రోడ్లు వేసేందుకు రూ. 110 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. వాటిని ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది.

ప్రశ్న: ఆర్అండ్‌బీ సబ్‌డివిజన్ పరిధిలో సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నారా?

జవాబు: డివిజన్ పరిధిలో ముగ్గురు జేఈలు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. దీంతో పనిభారం పెరుగుతోంది. మిగతా సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

భూసార పరీక్ష కేంద్రంలో అగ్ని ప్రమాదం

కాలి బూడిదైన పరికరాలు



కాలిపోయిన పరికరాలను పరిశీలిస్తున్న ఏవో

ఎమ్మిగనూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ శివారులోని ముగతి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న భూసార పరీక్ష కేంద్రంలో బుధవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక అధికారులు తెలిపిన సమాచారం మేరకు.. రోజు మాదిరిగానే బుధవారం భూసార పరీక్ష కేంద్రానికి విధులకు హాజరయ్యేందుకు వచ్చిన సిబ్బంది కేంద్రంలో అప్పటికే మంటలు చెలరేగి ఉండటం చూసి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. కాగా అప్పటికే కేంద్రంలోని విద్యుత్ మీటర్ వైరింగ్ పూర్తిగా కాలిపోయింది. అలాగే కేంద్రంలో ఉన్న కొన్ని పరికరాలతో పాటు పోగా మిషన్ కూడా కాలిపోయింది. అయితే కేంద్రంలోని ల్యాబ్‌తో పాటు విలువైన యంత్రాలు ఉన్న గదుల్లోకి మంటలు ప్యాపించకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయ్యింది. భూ సార పరీక్ష కేంద్రానికి వివిధ గ్రామాల నుంచి తెచ్చిన నమూన మట్టి కాస్త తడిసి పూర్తిగా పాడైపోయాయి. సమాచారం అందుకున్న స్థానిక ఏవో మురళి కేంద్రాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

ఉపాధ్యాయుడికి తెలుగు కీర్తి పురస్కారం

గోనెగండ్ల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలం పెద్దమరివీడు పాఠశాల ఉపాధ్యాయుడు అరెకటిక నాగేశ్వరరావు 'తెలుగు కీర్తి' పురస్కారాన్ని అందుకున్నారు. కవి, రచయితగా నాగేశ్వరరావుకు పేరుంది. తెలుగులో రెండు వేలకు పైగా వచన కవితలు, మణిపూసలు ప్రక్రియలో 500, సున్నత ప్రక్రియలో 700, బాల సాహిత్యంలో 100 పైగా గేయాలు మెరుపులు, తణుకులు, ముత్యాల హారం, రాజశ్రీయులు మొదలైన ప్రక్రియలో శతాధికంగా రాసి 300 పైగా పురస్కారాలు నాగేశ్వరరావు పొందారు. అలాగే నాగేశ్వరరావు కవినేత్రం, యుగపురుషులు, కవిపుంగవులు, జాతి నేతలు, అక్షర శ్రామికుడు అనే పుస్తకాలను కూడా రచించి ప్రచురించారు. పురస్కారం అందుకున్న నాగేశ్వరరావును తోటి ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.



తెలుగు కీర్తి పురస్కారం అందుకుంటున్న నాగేశ్వరరావు